జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 5 సంచిక - 05

పక్షపత్రిక

మార్చి 1-15, 2014





అసంఘటిత కార్మికులతో డా॥ జేపీ

## జనం నుంచి ఎజెండా


రాష్ట్ర విభజన బాధాకరమే... కానీ,
ముందుచూపుంటే భవిత బంగారమే..
కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలకి లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి
మనం ఓటు వేసి గెలిపించిన వాళ్ళు
రాష్ట్రాన్ని కలిపి ఉంచలేక పోయారు, విడిపోతుంటే
మన ప్రయోజనాలు కాపాడలేకపోయారు
(అసెంబ్లిలో, పార్లమెంటులో గోల చెయ్యడం తప్ప...)
MLA, MP
కానీ, జేపీ ఒక్కరే...
రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా ఇచ్చే
10 ప్రతిపాదనలను సూచించారు,
జాతీయ పార్టీలనీ ఒప్పించి సాధించారు
లోక్‌సత్తాకు వేసే ఓటు వృధా కాదు... ఆలోచించండి... కలిసిరండి...
లోక్‌సత్తాకు మద్దతు తెలిపేందుకు 80 99 333 444 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వండి
win.loksatta.org

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మార్చి 1-15, 2014

సంపుటి - 5 సంచిక - 05

## లోపలి పేజీల్లో...

జనం నుంచి ఎజెండా ....................................6
ఆంధ్రకు ఆరు సూత్రాల ప్యాకేజీ....................9
ప్రత్యేక హోదా లాభాలివీ..........................10
ఆదాయ లోటును కేంద్రమే భర్తీ చేయాలి...11
తెలుగు ప్రజల ఆర్థిక భవిష్యత్తుని పరిరక్షించిన లోక్‌సత్తా..............................................13
కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలకు లోక్‌సత్తా పార్టీ లేఖ ...16
ఒకే లక్ష్యం... అభివృద్ధి ...........................20
వారేమీ పైనుంచి ఊడిపడలేదు................22
ఆల్ ఫ్రీ తాయిలాలు చెల్లవిక ....................23
రోగమొకటి... మందొకటి.........................24
ఆ ముగ్గురూ... సమైక్య 'వ్యాపారులు'.........27
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సమన్వయ కమిటీల ఏర్పాటు......30
జిల్లా వార్తలు ..........................................31

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**

పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : కె. శ్రీలత
ఫొటోలు : ఎస్. సంజీవ్ కుమార్

# ఈ పక్షం చాట్ మసాలా

**1. త్యాగ"బాబు"**



"తెలంగాణ ముఖ్యమంత్రి పదవి బడుగులకే!" - చంద్రబాబు

**గాలికిపోయే పేలపిండి కృష్ణార్పణం అంటే ఇదే**

**ఎలాగు గెలవని రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బాబు**

**2. తనదాకా వస్తే...**



"సర్వేలు, ఒపినియన్ పోల్స్‌ను నియంత్రించాలి" - కేజ్రీవాల్

**అవును..! వాళ్ళు కేజ్రీ ప్రధాని అవుతాడని చెప్పట్లేదు మరి..!**

**3. రిక్షావాలా!**



"ఒక్కరోజు రిక్షా తొక్కాలని ఉంది" - రాహుల్

**పి.యం. సీటు ఎక్కిద్దాం అనుకుంటే, రిక్షా తొక్కుతానంటున్నాడు... పాపం సోనియా!**

**4. చావు భాష**



"పురుడు పోసి తల్లిని చంపేశారు" - రాష్ట్ర విభజనపై మోడీ

**సిజేరియన్ చేసే పని మంత్రసానికి అప్పగించారు మరి..!**

**అయినా.. మోడీకి చావు భాష తప్ప ఇంకొకటి రాదా..!**

**5. ఒక్కటి చాలు!**



"సీమాంధ్రలో కాంగ్రెస్‌ను నరికేయాలి" - జగన్

**ఇడుపులపాయ కాంగ్రెస్.. ఇటలీ కాంగ్రెస్.. రెండు ఎందుకు? ఒక్కటి చాలు...**

❖❖❖




ఇక దేశాన్ని నడిపిస్తాం...! మూడో ఫ్రంట్

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. ***10*** ,
ఏడాది చందా : రు. ***200***
మూడేళ్ళ చందా : రు. ***500***

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ఎన్నికల ఖర్చు-ప్రయోజక శూన్యమైన పరిమితులు

సంపాదకీయం

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో అభ్యర్థులు చేస్తున్న ఖర్చు అనూహ్యంగా పెరిగిపోతున్నది. ఎన్నికల కమిషన్ విధించే పరిమితులకు, వాస్తవ ఖర్చుకీ పొంతన లేకుండా పోయింది.

ప్రస్తుతం రాష్ట్రంలో సంప్రదాయ రాజకీయ పార్టీల అభ్యర్థుల కనీస ఖర్చు అసెంబ్లీకి 15 కోట్లు, పార్లమెంటుకు 50 కోట్లు అయింది. ఇందులో 70-80 శాతం ఖర్చు ఓట్లు కొనుగోళ్లకీ, మద్య పంపిణీకి, ఇతర ప్రలోభాలకీ వెచ్చిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చెయ్యాలంటే అడ్డదారుల్లో అక్రమార్జన చేసిన వారే తప్ప ఈ పార్టీలలో మరొకరికి టిక్కెట్టు లభించని స్థితి ఏర్పడింది. మన ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిందనడానికి ఇంతకంటే దృష్టాంతం మరొకటి అవసరం లేదు.

ఇప్పుడు ఎన్నికల కమిషన్ అభ్యర్థుల వ్యయ పరిమితిని బాగా పెంచింది. అసెంబ్లీ అభ్యర్థికి గరిష్టంగా 28 లక్షలు, పార్లమెంటు అభ్యర్థికి గరిష్టంగా 70 లక్షలుగా పరిమితిని నిర్ణయించింది. ఇది అభ్యర్థులు సమర్పించే లెక్కల సర్దుబాటుకు తోడ్పడుతుందే తప్ప డబ్బు చుట్టూ తిరుగుతున్న ఎన్నికల వ్యవస్థలో నిజాయితీని పెంచేది మాత్రం కాదు. ఇలాంటి కంటితుడుపు చర్యలు ఓట్ల కొనుగోళ్లనీ నిరోధించేవి కావు.

నిజానికి మన ఎన్నికల వ్యవస్థ ఇప్పుడు ఒక వికృత రూపం ధరించింది. ఎన్నికల్లో కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టి, అధికారం రాగానే తిరిగి పదిరెట్లు దండుకునే వ్యాపారంగా మార్చింది. దీనికి చిల్లరమల్లర సవరణలతో ఎలాంటి ఫలితాలు రావు. ఈ ఎన్నికల వ్యవస్థను సమూలంగా మార్చాలి. అంతకుమించి మార్గాంతరం లేదు.

దామాషా పద్ధతి ఎన్నిక ఉన్నంతలో శ్రేష్టమైన పరిష్కారం. అక్కడ అభ్యర్థులకంటే పార్టీలకు ప్రాధాన్యత వస్తుంది. పార్టీలకు వేసే ఓటు అభ్యర్థుల విజయానికి కీలకం అవుతుంది. ఓట్లు కొనుగోలు చేసిన అభ్యర్థులే నేరుగా లబ్ధిపొందే పరిస్థితి తొలగిస్తుంది. అందుచేత ఎన్నికల వ్యవస్థలో మార్పే మన ప్రజాస్వామ్యాన్ని సక్రమ పద్ధతిలో నిలబెడుతుంది.

ఈ ఎన్నికల వ్యవస్థ మార్పుతోపాటు ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వం భరించే పద్ధతి ప్రవేశపెడితే అప్పుడు ఫలితాలు మరింత మెరుగుపడతాయి. సమాజహితం కోసం రాజకీయాలలో కృషిచేసేవారే అభ్యర్థులు కాగలుగుతారు. డబ్బుతో పోటీకాకుండా విధానాల మీద పోటీ కీలకపాత్ర వహిస్తుంది. ప్రలోభ రాజకీయం కనుమరుగౌతుంది. జన రాజకీయం వికసిస్తుంది. ♦



# రూ. 1000 కోట్ల నిధులున్నా సంక్షేమం సున్న

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తెలుసుకున్న జేపీ

ప్రజల నుంచి ఎన్నికల మేనిఫెస్టోని తయారుచేసేందుకు లోక్‌సత్తా పార్టీ చేపట్టిన **'జనం నుంచి ఎజెండా'** తొలిదశ కార్యక్రమాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రారంభించారు. అడ్డాకూలీలతో జేపీ ముఖాముఖి మాట్లాడి వాళ్ల సమస్యలు తెలుసుకున్నారు. మద్యం, జీవన భద్రత లేకపోవటం, పనిలో ప్రమాదం జరిగితే ఆదుకునేవారు లేకపోవటం తదితర సమస్యలను మహిళా కూలీలు జేపీ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్ని పార్టీలు వచ్చినా తమ బతుకులు మారటం లేదని, తమ సమస్యలు పరిష్కరించేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు కూడా జేపీతో పాటు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ కాలనీలో వడ్రంగులతో జేపీ మాట్లాడారు. వడ్రంగం తనకి చాలా ఇష్టమైన పని అని జేపీ అన్నారు. స్వయంగా ఉలిబాడిశ పట్టుకుని కొద్దిసేపు వడ్రంగి పని చేసిన అనంతరం వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. రోజంతా కష్టపడినా శ్రమకు తగ్గ ప్రతిఫలం రావటం లేదని, పిల్లల్ని చదివించుకోవాలన్నా, చిన్నచిన్న జబ్బులకు ఆసుపత్రికి వెళ్లాలన్నా వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయని కార్పెంటర్లు చెప్పారు.

అనంతరం మియాపూర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు వెళ్లి తాపీ పనివారి సమస్యలను జేపీ అడిగి తెలుసుకున్నారు. స్వయంగా గోవ ఎక్కి తాపీ పని చేశారు. మొదటి అంతస్తు ఎక్కటానికే తనకు కష్టం అనిపించిందని,



**జనం నుంచి ఎజెండా**

అలాంటిది పదిపదిహేను అంతస్తుల భవనాలను ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండా ఎలా చేయగలుగుతున్నారని తాపీ పనివారిని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో కనీసం రోజుకు 5గురు తాపీవారు పనిలో జరిగే ప్రమాదాల్లో చనిపోతున్నారని, వీరిని ఆదుకునే దిక్కే లేకుండా పోయిందని జేపీ తెలిపారు. ప్రమాదాన్ని నివారించటానికి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాల్సుందని అన్నారు.

అనంతరం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్‌లో జేపీ ఎలక్ట్రీషియన్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 7లక్షలకు పైగా ఎలక్ట్రీషియన్లు ఉన్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు చట్టాలైతే చేశాయి, పన్నులైతే వసూలు చేస్తున్నాయిగానీ, ఫలితాలు మాత్రం లేవని అన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధి పేరుతో ప్రభుత్వం భవన నిర్మాణదారుల నుంచి రూ.1023 కోట్లు వసూలు చేసిందని జేపీ అన్నారు. దీనిలో కేవలం రూ.60 కోట్లు మాత్రమే ప్రభుత్వాలు ఖర్చు పెట్టాయని, ఈ పథకం గురించి ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అసంఘటితరంగంలో ఉన్న లక్షలాది కుటుంబాలకు భరోసా కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ వర్గాల ప్రజలను కలుస్తున్నామని, వారందరి జీవితాల్ని సమూలంగా మార్చేసే మేనిఫెస్టోని వారం పదిరోజుల్లో లోక్‌సత్తా ప్రకటిస్తుందని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించటమే నిజమైన రాజకీయమని, అలాంటి రాజకీయం చేస్తున్న లోక్‌సత్తా పార్టీని అందరూ ఆదరించాలని కోరారు. ఈ పర్యటనలో లోక్‌సత్తా పార్టీ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు గొర్తి శ్రీనివాస్, శేరిలింగంపల్లి నాయకులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి బొంతు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ◆

# మీ బతుకుబండికి లోక్‌సత్తా రూట్‌లోనే భరోసా

## లారీ, ఆటో, ప్రైవేటు బస్సు డ్రైవర్లు, క్లీనర్లతో జేపీ

2014 ఎన్నికల మేనిఫెస్టో తయారీలో భాగంగా లోక్‌సత్తా పార్టీ ప్రారంభించిన 'జనం నుంచి ఎజెండా' తొలి దశ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా, రవాణా రంగంలో పనిచేస్తున్న అసంఘటిత డ్రైవర్లు, క్లీనర్ల సమస్యల్ని స్వయంగా తెలుసుకునేందుకు లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్ నగరంలో పర్యటించారు.

కూకట్‌పల్లిలో ప్రైవేటు బస్సు డ్రైవర్లు, క్లీనర్లతో జేపీ ముఖాముఖి సమావేశమయ్యారు. రాత్రంతా బస్సు నడిపి వచ్చిన తమకు పగలు విశ్రాంతి తీసుకోవటానికి ఎలాంటి సౌకర్యాలు లేవని, కనీసం మరుగుదొడ్లు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసుల ఆంక్షలు, రవాణాశాఖ అధికారుల వేధింపుల కారణంగా తమ ఉపాధి పోతోందన్నారు. ప్రైవేటు స్కూలు ఫీజులు కట్టలేక పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నామని, చిన్న రోగం వచ్చినా వేలరూపాయల బిల్లుల్ని కట్టలేక అప్పుల పాలవుతున్నామని, ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు ఏమీ లేవని తెలిపారు. ఆరోగ్యం బాగాలేకపోయినా, ప్రమాదం జరిగినా, కుటుంబం పస్తులుండాల్సి వస్తోందని తమ బాధలు వెళ్లబోసుకున్నారు.

అనంతరం, మూసాపేటలోని ట్రక్‌పార్కింగ్ సెంటర్‌లో లారీ డ్రైవర్లు, యజమానులతో జేపీ సమావేశమయ్యారు. లారీలు నగరంలో ప్రవేశించే వేళలపై ఆంక్షలు ఉండటంతో తమ ఉపాధి దారుణంగా దెబ్బతింటోందని, సమయానికి చేరాలనే తొందరలో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెప్పారు. లారీలపై ఆధారపడి లక్షలమంది బతుకుతున్నారని, తమ

**జనం నుంచి ఎజెండా**

సంక్షేమం కోసం ప్రభుత్వం ఏమీ చేయటం లేదని వాపోయారు. సమాజానికి ఉపయోగపడే పనిచేస్తున్న తమని, ప్రభుత్వాలు మనుషులుగా కూడా చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతవరకూ ఏ ఒక్క నాయకుడూ తమ దగ్గరకు వచ్చి తమ సమస్యలు వినలేదని వారు అన్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియం చాలా ఎక్కువగా ఉంటోందని, సొంత లారీ కొనుక్కోవాలంటే ఫైనాన్స్ వాళ్లు రూ. 3 వడ్డీ దాకా తీసుకుంటున్నారని అన్నారు. తమకు పింఛన్ వచ్చే ఏర్పాటు చేయాలని వారు కోరారు.

బేగంపేట రైల్వేస్టేషన్ దగ్గర జేపీ ఆటోవాలాలతో సమావేశమయ్యారు. ఆటోడ్రైవర్‌తో కలిసి కొద్దిదూరం జేపీ ఆటో నడిపారు. సి.ఎన్.జి గ్యాస్ స్టేషన్లు లేకపోవటం వల్ల గ్యాస్ కోసం నాలుగైదు గంటలు వేచి చూడాల్సి వస్తోందన్నారు. పార్కింగ్ పేరుతో ట్రాఫిక్ పోలీసులు విపరీతంగా వేధింపులకు గురిచేస్తున్నారని, పాసింజర్లను దించటానికి రోడ్డుపై ఆపినా, ఫోటో తీసి చలానా రాస్తున్నారని అన్నారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉందిగానీ, ప్రమాదం జరిగితే ఆటోడ్రైవర్‌కు ఎలాంటి ఇన్సూరెన్స్ అందటం లేదని అన్నారు. పిల్లల స్కూలు ఫీజులకి నెలకి రూ. 1000–1500 ఖర్చు అవుతోందని వారు చెప్పారు.

అందరి సమస్యలూ ఆలకించిన జేపీ మాట్లాడుతూ, రాష్ట్రం మొత్తంలో రవాణారంగంలో ఉన్న 20లక్షల కుటుంబాలకు జీవన భద్రత, భరోసా కల్పించేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని, అసంఘటిత రంగంలో ఉన్న సుమారు 1 కోటి కార్మిక కుటుంబాలలో ఆనందం నింపేందుకు సమగ్ర, ఆచరణాత్మకమైన ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజలు, నాయకులు, వారి కుటుంబాల గురించి ఆలోచించకుండా, తమ కుటుంబాలకు మేలు చేసే వారికి ఓటు వేయాలని కోరారు. ఈ పర్యటనలో జేపీతో పాటు కూకట్‌పల్లి లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు కొమ్ము సత్తయ్య, సనత్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి హైమా ప్రవీణ్, స్థానిక నేతలు పాల్గొన్నారు. ◆



## జనం నుంచి ఎజెండా

# ఆంధ్రకు ఆరు సూత్రాల ప్యాకేజీ

- ఐదేళ్ళపాటు ప్రత్యేక హోదా
- పన్ను ప్రోత్సాహకాలు
- వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ
- పోలవరం ప్రాజెక్టును మేమే కడతాం
- కేంద్రం నుంచి తొలి ఏడాది లోటు భర్తీ
- రాజ్యసభలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటన

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో నిబద్ధతను చాటుకున్నట్లుగానే సీమాంధ్ర ప్రగతి, సంక్షేమానికి అండగా ఉంటామని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. సీమాంధ్ర ప్రయోజనాలు నెరవేర్చేలా చేయకపోతే, సవరణలు ప్రతిపాదిస్తామని భాజపా చేసిన ఒత్తిడి మేరకు బిల్లుకు అతీతంగా ప్రధాని ప్రత్యేక ప్రకటన చేశారు. రాజ్యసభలో 'ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు-2014' పై చర్చ ముగింపు సందర్భంగా గందరగోళ పరిస్థితులు కొనసాగుతుండగానే, కాంగ్రెస్ సభ్యుల రక్షణ మధ్య ఈ ప్రకటన చేశారు. ఇందులో భాగంగా.. విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌కు ఆరు సూత్రాల అభివృద్ధి ప్యాకేజీని ప్రకటించారు. ప్రధాని ప్రకటన ఆయన మాటల్లోనే...

"గౌరవ ఛైర్మన్‌గారు,

విపక్ష నేత, ఆంధ్రప్రదేశ్ సభ్యులు, ఇతర నేతలు వ్యక్తీకరించిన అభిప్రాయాలన్నింటినీ నేను సావధానంగా విన్నాను. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అన్ని ప్రాంతాలు, ముఖ్యంగా సీమాంధ్ర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుబోయే నిర్దిష్ట చర్యల గురించి హోంమంత్రి ఇప్పటికే పేర్కొన్నారు. ఈ విషయంలో నేను మరికొన్ని ప్రకటనలు చేయదలచుకున్నాను.

**మొదటిది :** కేంద్ర సాయంలో భాగంగా.. అయిదేళ్లపాటు 13 జిల్లాలతో కూడిన విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను కల్పిస్తాం. నాలుగు జిల్లాల రాయలసీమకూ, మూడు జిల్లాల ఉత్తర కోస్తాంధ్రకూ ఈ హోదా వర్తిస్తుంది. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలను బలోపేతం చేస్తుంది.

**రెండోది :** రెండు రాష్ట్రాల్లో పారిశ్రామికీకరణను ప్రోత్సహించేందుకు, ఆర్థిక వృద్ధి కోసం పన్ను ప్రోత్సాహకాలు కల్పించేందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఆర్థిక చర్యలను బిల్లులో పేర్కొనడం జరిగింది. ఇతర రాష్ట్రాలకు కల్పించిన తీరులోనే ఈ ప్రయోజనాలు ఉంటాయి.

**మూడోది :** ముఖ్యంగా రాయలసీమ, ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలకు వర్తించేలా.. విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌లోని వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ఇప్పటికే బిల్లు కల్పిస్తోంది. ఈ అభివృద్ధి ప్యాకేజీ ఒడిశాలోని కె-బి-కె (కోరాపుట్-బోలంగిర్-కలహండి) ప్రత్యేక ప్రణాళిక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రత్యేక ప్యాకేజీ తరహాలో ఉంటుంది.

**నాలుగోది :** పోలవరం ప్రాజెక్టు పరిధిలో పూర్తిస్థాయిలో పునరావాస, పునరాశ్రయ చర్యలు సంపూర్ణంగా, సాఫీగా సాగేందుకు మరిన్ని సవరణలు అవసరమైతే వాటిని సాధ్యమైనంత త్వరగా చేపడతామని గౌరవ సభ్యులకు మరోసారి హామీ ఇస్తున్నాను. పోలవరం ప్రాజెక్టును మా ప్రభుత్వమే చేపడుతుంది. ఇందులో ఎలాంటి అనుమానం పెట్టుకోవద్దు.

**అయిదోది :** సిబ్బంది, ఆర్థిక వ్యవహారాలు, ఆస్తులు, బకాయిల పంపిణీ వంటి వ్యవహారాలన్నీ సంతృప్తికరంగా పూర్తి చేసేందుకు.. 'నోటిఫైడ్' తేదీని దృష్టిలో ఉంచుకొని కొత్త రాష్ట్రం అవతరణకు సంబంధించిన 'అపాయింటెడ్ డే'ను నిర్ణయిస్తాం.

**ఆరోది :** విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఏడాదిలో (ముఖ్యంగా అపాయింటెడ్ డే నుంచి 14వ ప్రణాళిక సంఘం సిఫార్సులను భారత ప్రభుత్వం అంగీకరించడానికి మధ్య) తలెత్తే వనరుల కొరతను 2014-15 కేంద్ర బడ్జెట్‌లో భర్తీ చేయడం జరుగుతుంది.

ఈ అదనపు ప్రకటన ద్వారా మా చిత్తశుద్ధి కేవలం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపైనే కాకుండా, సీమాంధ్ర సౌభాగ్యానికి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామనేది తెలుపుతోంది". ◆

# 'ప్రత్యేక హోదా' లాభాలివీ..

రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా అంటే ఏమిటి? దానివల్ల లభించే ప్రయోజనాలేమిటి? అనే విషయమై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

➢ 1969లో తొలిసారి రాష్ట్రాలకు ప్రత్యేక హోదా అంశం తెరపైకి వచ్చింది.

➢ ఐదు అంశాల ఆధారంగా ప్రత్యేక హోదా కల్పిస్తారు. 1. పర్వత ప్రాంతం. 2. జనసాంద్రత తక్కువగా ఉండటం లేదా గిరిజన జనాభా ఎక్కువగా ఉండటం. 3. పొరుగు దేశాలతో సరిహద్దులు పంచుకునే వ్యూహాత్మక ప్రాంతం కావడం. 4. ఆర్థిక, మౌలిక సదుపాయాల్లో వెనుకబాటుతనం కలిగి ఉండడం. 5. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉండటం.

➢ ఈ ఐదు అంశాల్లో ఏ ఒక్క అంశం పరిధిలోకి ఆ రాష్ట్రం వచ్చినా దానికి ప్రత్యేక హోదా కల్పించాల్సి వుంటుంది. ప్రస్తుతం రాష్ట్ర విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక, మౌలిక సదుపాయాల్లో వెనుకబాటుతనం, ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉండటం వంటి కారణాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రత్యేక హోదా కల్పించారు.

➢ మొదట అసోం, నాగాలాండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారు. తరువాత అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ప్రత్యేక హోదా రాష్ట్రాల జాబితాలో చేర్చారు.

➢ ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలా..? వద్దా..? అన్న విషయాన్ని ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రణాళిక సంఘం సభ్యులతో కూడిన జాతీయ అభివృద్ధి మండలి నిర్ణయిస్తుంది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రణాళిక సంఘం, ఆర్థిక సంఘం కీలకపాత్ర పోషిస్తాయి. కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీని ఈ రెండు సంఘాలు పర్యవేక్షిస్తాయి. రాష్ట్ర ప్రణాళికల కోసం ఉద్దేశించిన నిధులను కేంద్ర సహాయం కింద ప్రణాళికా సంఘం ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తుంది.

➢ కేంద్ర సాయం మూడు రకాలుగా ఉంటుంది. సాధారణ కేంద్ర సాయం (ఎన్‌సీఏ), అదనపు కేంద్ర సాయం (ఏసీఏ), ప్రత్యేక కేంద్ర సాయం (ఎస్‌సీఏ). ఎన్‌సీఏ కేటగిరీ కింద అందించే మొత్తం సాయంలో 30 శాతం గ్రాంట్ల రూపంలో అందుతుంది. ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు తమ అవసరాల మేర రుణాలు పొందే స్వేచ్ఛ ఉంటుంది. 90 శాతం గ్రాంట్లు, 10 శాతం రుణాల ఫార్ములాను కేంద్ర ప్రాయోజిక పథకాలు, విదేశీ సాయంతో నడిచే పథకాలకు వర్తింపజేస్తారు.

➢ ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలు పలు రాయితీలు, పన్ను మినహాయింపులు పొందుతాయి. ఎక్సైజ్, కస్టమ్స్, ఆదాయపు పన్ను రేట్లు, కార్పొరేట్ పన్ను రేట్లలో మినహాయింపులు ఉంటాయి. ప్రణాళిక సంఘం విదేశీ సాయంతో నడిచే పథకాలకు, నిర్దిష్ట పథకాలకు ఆర్థిక సాయం అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వ సాయంతో నడిచే పథకాలకు కూడా ఆర్థిక సహాయాన్ని వర్తింపజేస్తుంది.

**స్థూలంగా ఇవీ ప్రయోజనాలు..**

✓ కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో నిధులు అందుతాయి.

✓ కేంద్ర ప్రభుత్వ స్థూల బడ్జెట్‌లో 30% నిధులు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకే వెళతాయి.

✓ పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఆకర్షించి వస్తూత్పత్తి పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఎక్సైజ్ డ్యూటీలో భారీ స్థాయిలో రాయితీలు లభిస్తాయి.

✓ ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలు రుణాలపై వడ్డీని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. వడ్డీ రాయితీ పథకాలు పొందే అవకాశం కూడా ఉంటుంది. ◆

# అవశేష ఆంధ్రప్రదేశ్ ఆదాయ లోటును కేంద్రమే భర్తీ చేయాలి: జేపీ

తెలుగునాట రెండు రాష్ట్రాలు ఏర్పడుతున్న తరుణంలో యూపీయే ప్రభుత్వం ఏరు దాటాక తెప్ప తగలేసే రీతిలో వ్యవహరించకూడదని, ఆర్థికంగా మహానగరం అండ లేకపోవటం వల్ల రాయలసీమ, కోస్తాంధ్రకు వచ్చే ఆదాయలోటును పూర్తిస్థాయిలో భర్తీ చేయాల్సిందేనని, భవిష్యత్తులో మూడు ప్రాంతాలూ ఎదిగేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాల్సిందేనని, ఇందుకు ప్రధాన ప్రతిపక్షం బీజేపీ కూడా బాధ్యత తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు.

**లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో జేపీ మాట్లాడుతూ...** రాష్ట్రాన్ని విభజిస్తే సీమాంధ్రకు మొదటిరోజు నుంచే ఇప్పుడున్న లెక్కల ప్రకారం రూ.10,000 కోట్ల లోటు ఏర్పడుతుందని లోక్‌సత్తా లెక్కలతో సహా వివరించిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తూనే సీమాంధ్ర సంక్షోభాన్ని ఎలా పరిష్కరించాలో కూడా సవివరంగా అసెంబ్లీలోనే చెప్పిందని, ఈ లెక్కల్నే కేంద్రం, బీజేపీ కూడా చెబుతూ లోక్‌సత్తా సవరణలు బాగున్నాయి, తప్పక బిల్లులో చేరుస్తాం అని బహిరంగంగానే పలుమార్లు ప్రకటించినా ఇప్పటివరకూ ఆ దిశగా ఆచరణలో చూపలేకపోయాయని అన్నారు. నైపుణ్యంతో శస్త్రచికిత్స చేయాల్సిన చోట గండ్ర గొడ్డలితో అడ్డంగా నరికినట్టు, తదనంతర పరిణామాలను పట్టించుకోకుండా రాష్ట్ర విభజనను కేంద్రం చేపట్టిందన్నారు.

అవశేష ఆంధ్రప్రదేశ్‌లో లోటును వచ్చే 10ఏళ్ల పాటు భర్తీ చేసేందుకు కేంద్రప్రభుత్వంచర్యలు తీసుకోవాల్సిందేనని జేపీ స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల అభివృద్ధి కోసం విభజన చేపడుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం చెప్పలేదా అని ప్రశ్నించారు.

**లోక్‌సత్తా చేసిన, కేంద్రం, బీజేపీ ఇద్దరూ ఆమోదించిన ఈ 5 సవరణల్నీ ఖచ్చితంగా బిల్లులో చేర్చాలని జేపీ డిమాండ్ చేశారు:**

1. హైదరాబాద్‌లో రూ.13,000 కోట్ల మిగులు ఆదాయం ఉంటుంది కాబట్టి తెలంగాణ లోటు నుంచి బైటపడుతుంది. ఇది మంచి పరిణామం. కానీ మిగిలిన ప్రాంతాలలో ఏర్పడే భారీ లోటును భర్తీ చేసే బాధ్యతను కేంద్రప్రభుత్వమే చేపట్టాలి.

2. హైదరాబాద్‌లో కేవలం ఆర్థిక వ్యవస్థనే కాకుండా పారిశ్రామికరంగాన్ని కూడా కేంద్రకరించారు. ఈ పరిస్థితిని ఇప్పటికైనా మార్చేందుకు వెనకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు పారిశ్రామిక రాయితీలను ఇవ్వాలి. ఎక్సయిజ్, ఆదాయపన్ను, పెట్టుబడి రాయితీ, రవాణా సబ్సిడీ ఇవ్వాలి. ఇందుకోసం శాసనసభలో గణాంక సహితంగా వివరాలు అందించాం. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్ కంటే తలసరి ఆదాయం సుమారు 40శాతం మేర తక్కువ ఉంది కాబట్టి, ఆ



రెండు రాష్ట్రాలకూ ప్రత్యేక ప్రతిపత్తి హోదా ద్వారా ఇచ్చే రాయితీల్ని రాయలసీమ, ఉత్తరాంధ్రకు కూడా ఇవ్వాలి.

3. విద్య, మౌలిక సదుపాయాలను ఖచ్చితంగా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసే ఏర్పాటు చేయాలి. దాంతోపాటు రామాయపట్నంను కేంద్రప్రభుత్వ పెట్టుబడులతో ప్రధాన పోర్టుగా ఏర్పాటు చేసి కృష్ణా డెల్టాలో పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

4. కొత్త రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేసినా ఒకేచోట కేంద్రీకరించకుండా అసెంబ్లీ ఒకచోట, హైకోర్టు ఇంకోచోట, వీలుంటే వేసవి రాజధాని మరోచోట ఏర్పాటు చేయాలి. రాజధాని ఆర్థిక కేంద్రం కాకుండా చూసుకోవాలి. వీలైనంత వేగంగా కొత్త రాజధానుల్ని పూర్తి చేసి పదేళ్లలోపే అన్ని కార్యాలయాలనూ తరలించాలి. లేకుంటే దృష్టి ఎప్పటికీ హైదరాబాద్ మీదే ఉంటుంది.

5. హైదరాబాద్‌లో శాంతిభద్రతల మీద గవర్నర్‌కి అధికారం ఇచ్చారుగానీ, ఇది రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాగంలో రాష్ట్రాల అధికారానికి సంబంధించిన 7వ షెడ్యూల్ 2వ జాబితాలో మొట్టమొదటి అంశమే శాంతిభద్రతలు. వీటిపై గవర్నర్‌కి తాత్కాలిక అధికారం ఇవ్వాలంటే, అరుణాచల్ ప్రదేశ్‌లో తెచ్చినట్టు రాజ్యాంగ సవరణ తేవాలి.

ఇవన్నీ ధర్మబద్ధమైన సవరణలని వీటిని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రం, బీజేపీ మీద ఉందని జేపీ అన్నారు.

లోక్‌సత్తా చేసిన సవరణల్లో కేవలం మూడింటిని - 1)సాగునీటి విషయంలో పోలవరం ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రం ఆమోదించినట్టుగా చేయటం, ఈ ప్రాజెక్టు వల్ల ఖమ్మం జిల్లాలో ముంపునకు గురయ్యే గ్రామాలను సీమాంధ్రలో కలపటం 2) వరద జలాల మీద ఆధారపడి తెలంగాణ, సీమాంధ్రలో కడుతున్న నెట్టెంపాడు, కల్వకుర్తి, హంద్రీనీవా గాలేరు నగరి, వెలుగోడు ప్రాజెక్టులకు నికర జలాల్ని కేటాయించి తెలంగాణ, మిగిలిన రాష్ట్రం అడ్డుకోకుండా ఏర్పాటు 3) తెలంగాణ ప్రాంతంలో 4,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం, తెలంగాణలోని మారుమూల ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం, మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ రాజధానిని నిర్మించినా హైదరాబాద్‌తో కలుపుతూ ఎక్స్‌ప్రెస్ హైవే వంటివి ఏర్పాటు- ఖచ్చితంగా చేస్తామని బిల్లులో చేర్చారని జేపీ అన్నారు. మిగిలినవి మాత్రం లోక్‌సత్తా గట్టిగా ఒత్తిడి తేగాతేగా, కొన్ని పదాల్ని వాడుతున్నారు తప్ప నిర్దిష్టమైన చర్యలు లేవన్నారు.

**విభజన వల్ల కొందరు హతాశులై భావోద్వేగానికిలోనై ఈదేశం మాకెందుకు అంటున్నారని,** ప్రాంతాలుగా విడిపోయినా తెలుగు ప్రజలంతా ఒకటేనని, అందరం భారతీయులమేనని, రాజకీయ పటం మీద గీతలు ప్రజల మధ్య అడ్డుగోడలు కాకూడదని జేపీ అన్నారు. హైదరాబాద్ నగరంలో ఉండటం పట్ల ఎవరికీ చింత ఉండనక్కర్లేదన్నారు. లోక్‌సత్తా ప్రాణాలడ్డయినా హైదరాబాద్‌లో అందరి హక్కుల పరిరక్షణకు తగిన ఏర్పాట్లను, సంస్కృతిని నిర్మిస్తుందన్నారు. మాటలు గీతలు దాటబట్టే ఇలాంటి వికృత పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ప్రాబల్యంలో ఉన్న సాంప్రదాయపార్టీల అధికార దాహానికి ప్రజలు భారీ మూల్యం చెల్లించారన్నారు. రాజకీయాలు ప్రజల చుట్టూ తిరగాలి తప్ప నేతలు, వారి కుటుంబాల చుట్టూ కాదన్నారు. అసలైన రాజకీయమంటే, జనం చేతికి అధికారం, అవినీతి అంతం, పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు, ఉద్యోగాలు, ఉపాధి సృష్టి జరగటం వంటివి అన్నారు. ఈవేళ కావలసింది నిబద్ధత, పరిణతి, సామర్థ్యం, ముందుచూపు గల నాయకత్వమన్నారు.

**రాజకీయాల తీరుతెన్నుల్ని మార్చటానికి లోక్‌సత్తాను వేదికగా ఉపయోగించుకోవాలని** ప్రజలకు, ముఖ్యంగా యువతకు, మహిళలకు, రైతులకు జేపీ పిలుపునిచ్చారు. ప్రజలలో భవిష్యత్తు పట్ల ఆశను పెంచాలని, ఇటీవలి పరిణామాల వల్ల తలెత్తిన నిరాశను, నిస్పృహను పెంచవద్దని, ద్వేషాన్ని పెంచేవారిని ద్రోహులుగా ప్రజల ముందు నిలపాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

**ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాజీనామా** ఆయన కుటుంబ పరిధి వ్యవహారం లాంటిదని, ఇప్పుడున్న పరిస్థితులలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించటమే మేలని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు.

ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు జె. ఐరామమూర్తి, నందిపేట రవీందర్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. ◆

# తెలుగు ప్రజల ఆర్థిక భవిష్యత్తుని పరిరక్షించిన లోక్‌సత్తా, పార్టీ సవరణల ఆమోదం పట్ల జేపీ హర్షం

రాష్ట్ర విభజన తరుణంలో సీమాంధ్రకు ఎటువంటి ఆర్థికలోటూ లేకుండా, రెండు రాష్ట్రాలకూ భవిష్యత్తు మరింత మెరుగ్గా ఉండేలా, తెలుగువారందరికీ గతంలో కంటే ఎక్కువ ఆర్థికబలం చేకూరేలా చేసేందుకు లోక్‌సత్తా చేసిన లోతైన కృషి ఫలించిందని, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై జరిగిన చర్చలో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ప్రధాన ప్రతిపక్షం బీజేపీ లోక్‌సత్తా బైటపెట్టిన అంకెల్నే ఉటంకిస్తూ, లోక్‌సత్తా ప్రతిపాదించిన సవరణల్నే చర్చించి ఆమోదించాయని పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర విభజనపై రాజకీయాల్ని, మానసిక ఉద్వేగాల్ని పక్కనబెడితే మనం చేయదగ్గది రెండు రాష్ట్రాల మనుగడకు, అభివృద్ధికీ కీలకమైన ఆర్థిక వనరుల్ని సాధించటమని, అందుకే వాటి మీదే దృష్టి పెట్టి రాష్ట్రం నుంచి, జాతీయ స్థాయి వరకూ అందరినీ ప్రభావితం చేసి లోక్‌సత్తా సాధించగలిగిందన్నారు. లోక్‌సత్తా ప్రతిపాదనలను తీసుకుని రాజ్యసభలో పట్టుబట్టినందుకు బీజేపీకి జేపీ ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సత్తా కృషి వల్ల, బీజేపీ పట్టు వల్ల, కేంద్రప్రభుత్వంలో ఆఖరి నిముషంలోనైనా కొందరిలో కలిగిన ప్రాప్తకాలజ్ఞత వల్ల తెలుగువారికి లభించిన ఆర్థిక వనరుల్ని కేంద్రాన్ని వెన్నంటి సాధించుకోవాలని, వీటిని సద్వినియోగం చేసుకునేలా రాజకీయ వ్యవస్థను పునర్నిర్మించుకోవాలని జేపీ ప్రజలకు పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుకు సవరణలపై పార్లమెంటులో ప్రధానమంత్రి చేసిన ప్రకటనపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...** లోక్‌సత్తాకు ఓటు వేస్తే వృధా అని భావిస్తూ ఇతర పార్టీలకు ఓటు వేస్తున్నవారంతా ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని, గత ఎన్నికలలో లోక్‌సత్తా మినహా ప్రజలు ఓటు వేసిన మిగిలిన 293 మంది శాసనసభ్యులూ రాష్ట్ర విభజన సంక్షోభం పరిష్కారానికి ఒక్కటంటే ఒక్క సూచననైనా చేశారా అని జేపీ ప్రశ్నించారు. సభను నడవనీయకుండా చేయటం, ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేయటం తప్ప ఈ పార్టీలు ఏం ఊడబడిచాయి అని అడిగారు. హేతుబద్ధమైన, తార్కికమైన, నిర్మాణాత్మకమైన, ఆచరణాత్మకమైన ప్రతిపాదనల్ని చేసిన ఘనత, వాటిని ఒడుపుగా సాధించిన ఘనత అనివార్యంగా లోక్‌సత్తాకే దక్కుతుందని జేపీ అన్నారు.

తన సవరణల ద్వారా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకూ లోక్‌సత్తా న్యాయం చేసిందని జేపీ అన్నారు. అయితే, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలంటే రాజకీయాల స్వభావం మారితేనే సాధ్యమవుతుందన్నారు. ఇంకా డబ్బు, కుటుంబ, వారసత్వ, కులం, మతం రాజకీయాల్నే కొనసాగిస్తే ఎన్ని రాష్ట్రాలు ఏర్పడినా జనం జీవితాలు మారవన్నారు. తెలంగాణ



కోసం ఎంతో ఉద్యమం, ఎంతో సాహిత్యం వచ్చిందని, ఎంతో మంది అమరులయ్యారని, ఎలాంటి తెలంగాణ కావాలో తేల్చుకుని అందుకోసం కార్యాచరణలోకి దిగాలన్నారు. నవ తెలంగాణ నిర్మాణం నవ రాజకీయంతోనే సాధ్యమవుతుందని ముఖ్యంగా యువత గుర్తించాలన్నారు. సీమాంధ్రులు రాష్ట్రం ముక్కలైందన్న బాధని దిగమింగి, భవిష్యత్తుని ఒక సవాలుగా తీసుకుని ఎదగాలని, రెండు రాష్ట్రాలూ భారత్‌లో తొలి రెండు స్థానాల్లో నిలవాలనీ అన్నారు. వనరులు, ప్రతిభాపాటవాలు, చొరవ, ఆత్మవిశ్వాసం ఉన్న తెలుగు జాతి దేశానికే తలమానికం అవుతుందని జేపీ ప్రకటించారు. నిజాయతీ, సమర్థత, పరిణతిగల లోక్‌సత్తా ప్రజల వేదిక అని, ఇందులో భాగస్వాములవుతూ లోక్‌సత్తాకు ఓటు వేస్తేనే ప్రజల జీవితాల్లో అటువంటి మార్పు సాధ్యమవుతుందని స్పష్టంచేశారు.

రాజధాని, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం రాష్ట్రం నుంచి విడిపోవటం దేశచరిత్రలో ఇదే మొదటిసారని, దీనివల్ల మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో తొలి రోజు నుంచీ వచ్చే రూ.10,000 కోట్ల పైచిలుకు ఆర్థిక లోటుని పూడ్చకపోతే సీమాంధ్ర తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుందని, అందువల్లే ఎన్నేళ్లుగా కొనసాగుతున్నా కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశం అంత సంక్లిష్టంగా మారిందని జేపీ అన్నారు. విభజించేటప్పుడు రెండు రాష్ట్రాలకూ నిధుల కొరత ఉండకుండా, భవిష్యత్తు మరింత బాగుండేలా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలదని, కానీ అవి ఒక్కటంటే ఒక్క అంకెను కూడా బైటపెట్టకుండా రాజకీయ డ్రామాలాడాయన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు శాసనసభకు రాగానే ఆర్థికాంశాలు సహా ఇతర నిర్దిష్టమైన అంశాల వివరాలు ఇవ్వాలని స్పీకర్‌కి లేఖ రాసిందని, అదే లేఖను రాష్ట్రం ఢిల్లీకి పంపినా, ఇతర పార్టీలూ అదే బాటలో లేఖలు రాసినా కేంద్రం స్పందించలేదన్నారు. చాలా కష్టపడి అర్థవంతమైన పరిష్కారం కోసం లోక్‌సత్తా ఆర్థిక గణాంకాలు సేకరించిందని, వీటినే యూపీయే ప్రభుత్వం, కేంద్రం కూడా వాస్తవాలుగా పేర్కొన్నాయని అన్నారు. జనవరిలో చాలా నిర్దిష్టమైన పరిష్కార ప్రతిపాదనను లోక్‌సత్తా చేసిందని, జనవరి 18న, అసెంబ్లీలో తమకు తక్కువ బలం ఉన్నా ఇచ్చిన సమయాన్ని నూరుశాతం సద్వినియోగం చేసుకుని పరిష్కారాన్ని ప్రకటించిందని తెలిపారు. లోక్‌సత్తా ప్రకటించిన సమగ్ర సామరస్య పరిష్కారానికి రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయి వరకూ ప్రభుత్వం, ప్రతిపక్షాలు కూడా సానుకూలంగా స్పందించాయన్నారు. కేవలం అసెంబ్లీలో ప్రకటించటానికి పరిమితం కాకుండా రాష్ట్రపతి, ప్రభుత్వ నేతలు, ప్రధాన ప్రతిపక్ష నేతలను కలిసి పరిష్కారం కోసం తాము ఒప్పించే ప్రయత్నం చేశామని, అసెంబ్లీలో చర్చ ముగిసి బిల్లులో ప్రభుత్వం కొన్ని సవరణలు చేశాక ఢిల్లీ వెళ్లి మరోసారి అందరినీ కలిసి ఈ పరిష్కారం కోసం అంగీకరింపచేసే యత్నం చేశామన్నారు. దాంతో, అప్పటిదాకా రాష్ట్రాన్ని గొడ్డలితో అడ్డంగా నరికేస్తాం, మీ చావు మీరు చావండి అన్నవాళ్లు కాస్తా రెండు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి ఒక ప్రాతిపదికను చూపించారన్నారు. కేవలం హైదరాబాద్ ఆదాయం మీద ఆధారపడిన తెలుగు ప్రజలకు అదనంగా కొత్త ఆర్థిక వనరులు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయన్నారు.

**లోక్‌సత్తా చేసిన ఈ దిగువ 8 కీలక సవరణలను కేంద్రం ఆమోదించిందని జేపీ వివరించారు...**

1) మిగిలిన ఆంధ్రప్రదేశ్ (నిజానికి ఇదే కొత్తగా ఏర్పడే రాష్ట్రం)కు కనీసం 10 ఏళ్లపాటు రెవిన్యూ లోటు లేకుండా స్పష్టమైన ప్రాతిపదిక కావాలని లోక్‌సత్తా కోరింది. ఇందుకోసం ప్రణాళికా సంఘం నుంచి వచ్చేలోగా బడ్జెట్‌లో ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి ప్రకటించారు.

2) హైదరాబాద్‌లోనే పారిశ్రామిక ప్రగతి కేంద్రీకృతమవటం వల్ల నష్టపోయిన రాయలసీమ, కోస్తాంధ్రలో పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా వచ్చేందుకు 20 ఏళ్ల పాటు సెంట్రల్ ఎక్సయిజ్, కార్పొరేట్ పన్నులు మినహాయింపు ఇవ్వాలని, ఆ తర్వాత 30 ఏళ్ల పాటు పెట్టుబడి, రవాణా రాయితీలు ఇవ్వాలని లోక్‌సత్తా ప్రతిపాదించింది. ప్రధాని 20 ఏళ్లు అనలేదు గానీ కొన్ని రాష్ట్రాలకిస్తున్నట్టు ఇస్తామన్నారు. మార్గం దొరికిందిగానీ స్పష్టత రాలేదు. దీనిమీద నిర్దిష్టహామీ కోసం మనం కసరత్తు చేయాలి.

3) బాగా వెనకబాటుతనం ఉన్న రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలతో సమానంగా ప్రత్యేక హోదా ఇవ్వాలని లోక్‌సత్తా చేసిన ప్రతిపాదనను కూడా కేంద్రం ఆమోదించింది. అయితే సీమాంధ్ర మొత్తానికీ ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్ర హోదా ఇస్తున్నట్టు ప్రధాని చెప్పారు. ప్రత్యేక ప్రతిపత్తి హోదా రాష్ట్రాలకే తప్ప ప్రాంతాలకు ఇంతవరకూ లేదు కాబట్టి అనే సాకుతో ఇలా చేస్తున్నట్టు కేంద్రప్రభుత్వం చెబుతోంది. మొత్తం రాష్ట్రానికీ వస్తే సంతోషమేగానీ, దీనివల్ల ముమ్ముందు మిగిలినరాష్ట్రాలు

కూడా ఇదే తరహాలో పోటీపడి కేంద్రానికి కొత్త సమస్యలు వస్తాయి. రాజ్యసభలో చర్చ సమయంలోనే మాయావతి సహా పలువురు నేతలు దీన్ని ప్రస్తావించారు. అందుకే లోక్‌సత్తా ముందుచూపుతో హిమాలయ సానువుల్లో రాష్ట్రాలకు మాత్రమే ప్రత్యేక హోదా ఉందని, దక్షిణాదిన, ద్వీపకల్ప భారతదేశంలో అలాంటి ప్రాంతం లేదని పేర్కొంటూ, రాయలసీమ,ఉత్తరాంధ్ర వెనకబాటుతనాన్ని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం తదితర రాష్ట్రాల అంకెలతో పోలుస్తూ ఆ రెండు ప్రాంతాలవరకే ప్రత్యేక ప్రతిపత్తి అడిగింది. కేంద్రం నిర్ణయం నేపథ్యంలో తెలుగు ప్రాంతం ఎంపీలంతా అప్రమత్తంగా ఉండి దేశానికి ఇబ్బంది లేకుండా రాబోయే కాలంలో మన ప్రయోజనాలను కాపాడుకోవాల్సి ఉంది. ఈ హోదా వల్ల ప్రణాళికా సంఘం నుంచి నిధుల్లో మన వాటా గణనీయంగా పెరుగుతుంది.

4) తెలంగాణ, రాయలసీమకు మేలుచేసే, కోస్తాంధ్రలో ఆయకట్టును స్థిరీకరించే పోలవరం బహుళార్థసాధక, అంతర్రాష్ట్ర ప్రాజెక్టుకు కేంద్రం పూర్తి సాయం అందించేలా, భద్రాచలం డివిజన్‌లోని ముంపు గ్రామాలు మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో చేర్చేందుకూ లోక్‌సత్తా చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. పోలవరం విషయంలో మరిన్ని అవసరమైన సవరణలకు సిద్ధమని ప్రధాని ప్రకటించటం హర్షణీయం.

5) తెలంగాణ, రాయలసీమలో మిగులు జలాలతో నిర్మితమవుతున్న నెట్టెంపాడు, కల్వకుర్తి, హంద్రీనీవా, గాలేరు నగరి, వెలుగోడు, వెలుగొండ తదితర ప్రాజెక్టులకు నికర జలాలు లభించేలా, ఇరు రాష్ట్రాలూ ఆమోదించినట్టు చేయాలన్న లోక్‌సత్తా సవరణకూ ఆమోదం లభించింది.

6) తెలంగాణ ప్రాంతంలో ఉన్న విద్యుత్ కొరతను తగ్గించటానికి సుమారు రూ. 20,000 కోట్ల వ్యయమయ్యే 4,000 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణానికి, వెనకబడిన జిల్లాల రవాణా అభివృద్ధికీ లోక్‌సత్తా చేసిన ప్రతిపాదనలకు ఇప్పటిదాకా చూస్తాం అన్నవారు ఖచ్చితంగా చేస్తామని హామీ ఇచ్చారు.

7) సీమాంధ్రలో విద్యాసంస్థలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కేంద్రం విస్పష్టమైన హామీ ఇచ్చింది.

8) హైదరాబాద్‌లో నివసించేవారికి భరోసా కోసం శాంతిభద్రతలపై గవర్నర్‌కి పరిమిత అధికారం ఇవ్వాలన్న ప్రతిపాదనకు రాజ్యాంగసవరణ కావాలని లోక్‌సత్తా చెప్పింది. కోర్టులు కొట్టివేస్తే దీనిపై రాజ్యాంగసవరణకు సిద్ధమని కేంద్రం, ప్రధాన ప్రతిపక్షం అంగీకరించాయి.

హైదరాబాద్ మొత్తం భారతదేశానిదీ, తెలుగువారిదీ, తెలంగాణ ప్రాంతానిదని, ఇక్కడ పరిమితంగా ఉండే ప్రభుత్వోద్యోగాలలో అవకాశాలు మినహా మిగిలిన అన్ని హక్కులూ అన్ని ప్రాంతాలవారికీ ఉంటాయని, అంచేత **హైదరాబాద్‌ను కోల్పోయామనే భావన నుంచి బైటపడాలని రాయలసీమ, కోస్తాంధ్రలోని యువతకు జేపీ విజ్ఞప్తి చేశారు.**

**తెలుగు తేజం యాత్ర తిరిగి ప్రారంభిస్తాం**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బీజేపీ కట్టుబడి ఉండి, తెలంగాణ ఇవ్వాలని మరో జాతీయపార్టీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించిన నేపథ్యంలో మూడు ప్రాంతాల తెలుగువారికీ న్యాయం జరిగేలా చేసేందుకు గతంలో లోక్‌సత్తా పార్టీ ప్రారంభించిన 'తెలుగు తేజం' యాత్ర ప్రజలలో తీవ్ర భావోద్వేగాల వల్ల వాయిదా పడిందని, రాజకీయాలను మార్చేలా, ప్రజల జీవితాలను మెరుగుపరిచేలా తెలుగు తేజం పర్యటనను ఇప్పుడు మరో రూపంలో తిరిగి ప్రారంభిస్తామని జేపీ ప్రకటించారు.

**మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కి కొత్త రాజధానిని** ఆ రాష్ట్ర శాసనసభ నిర్ణయించాలని, అయితే రాజధానిని ఒకే చోట పెట్టకుండా వికేంద్రీకరించాలని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు. రాష్ట్ర రాజధాని, అసెంబ్లీ వంటి విషయాల్లో జోక్యం చేసుకోవటానికి ఢిల్లీ పెద్దలెవరని అన్నారు.

**రెండు రాష్ట్రాలకూ లోక్‌సత్తా పార్టీ రెండు శాఖలు ఏర్పాటు** చేస్తుందని జేపీ మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. తెలంగాణ శాఖను ఏర్పాటు చేయటానికి ప్రస్తుత, గత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులతో సన్నాహక కమిటీని ఏర్పాటు చేశామని, కొన్ని వారాల్లో ఈ కసరత్తు పూర్తవుతుందని చెప్పారు. మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కి మరో కమిటీని ఏర్పాటు చేస్తామని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ, కార్యదర్శి నందిపేట రవీందర్, యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీ పాల్గొన్నారు. ◆

# విభజన బాధాకరమే, కానీ ... ఆలోచిస్తే అవకాశం కూడా !

## కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలకు లోక్‌సత్తా పార్టీ లేఖ

ఓట్లు, సీట్లు, కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు, దోచుకోవటం, దాచుకోవటం కోసం ప్రజలు నాశనమైనా ఫర్వాలేదనుకుని బరితెగించి రాష్ట్రంలోని, కేంద్రంలోని పార్టీలు ఆడిన వికృత రాజకీయ క్రీడ ఫలితమే ఈవేళ తెలుగు గడ్డ మీద సంక్షోభం.

కేవలం 2004 ఎన్నికలలో గెలవటం కోసం కాంగ్రెస్ తెలంగాణ వాదాన్ని రాజేసింది. 2009 ఎన్నికల కోసం తెలుగుదేశం దాన్ని కొనసాగించింది. జాతీయ ప్రతిపక్షం బీజేపీ కూడా తెలంగాణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. దీంతో తెలంగాణ ప్రాంత ప్రజలలో బలమైన ఆకాంక్ష తలెత్తింది. ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రాన్ని ఇష్టమొచ్చినట్టు విభజించుకోండని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా లేఖ ఇచ్చింది. ఆ పార్టీలకే కోస్తాంధ్ర, రాయలసీమ వాసులు కూడా ఓట్లు వేశారు. ఈ నేపథ్యంలో, ఉద్యమాలతో నాలుగున్నరేళ్లుగా పాలనస్తంభించి జనం జీవితాలు చితికిపోతున్న సమయంలో – రాజకీయంగా తనకు తక్కువ బలమే ఉన్నా తెలుగు ప్రజల సంక్షోభాన్ని పరిష్కరించే చారిత్రక బాధ్యతను లోక్‌సత్తా భుజాన వేసుకుంది. రాజ్యవ్యవస్థ మారకుండా ఎన్ని రాష్ట్రాలు ఏర్పడినా ప్రయోజనం వుండదని భావించే లోక్‌సత్తా పార్టీ, తెలుగు ప్రజల భవిష్యత్తు ముళ్ల మీద బట్ట లాగా మారటంతో ఒడుపుగా దాన్ని బైటికిలాగుతూ రాష్ట్ర సంక్షోభానికి సమగ్ర, సామరస్య పరిష్కారం కోసం కార్యాచరణ ప్రారంభించింది.



లోక్‌సత్తాకు ఓటు వేస్తే వేస్టు అనుకుంటూ ప్రజలు ఒకే ఒక్క ఎమ్మెల్యేను గెలిపించినా, ఆ ఒక్క ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ మూడు ప్రాంతాలకూ న్యాయం చేసే పరిష్కారాన్ని జనవరి 18, 2014న తెలుగు ప్రజల అత్యున్నత వేదికైన రాష్ట్ర శాసనసభలోనే ప్రకటించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తూనే రాయలసీమ, కోస్తాంధ్రకు ధోకా లేకుండా మూడు ప్రాంతాల తెలుగు ప్రజలందరి 'ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించేలా' జేపీ రోడ్‌మ్యాప్ వెలువరించారు.

గదిలో ఏనుగు ఉంది, లేనట్టు నటించొద్దు, అసెంబ్లీలో రాష్ట్ర విభజన సమస్యను చర్చించి ఫెడరల్ స్ఫూర్తితో తెలుగు గడ్డ మీదే పరిష్కరించుకుందామని జేపీ గత కొన్నేళ్లుగా చెబుతున్నా సభ నడవకుండా అడ్డుకుని, తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఢిల్లీలో తాకట్టు పెట్టాయి. కేసులకు భయపడి ఒకరు, అవినీతిని కప్పిపుచ్చుకోవటానికి ఇంకొకరు, పదవుల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు... ఇలా ప్రాబల్యం గల పార్టీలన్నీ ప్రజల్ని మోసం చేశాయి. బ్రహ్మాస్త్రాలు, సిక్సర్లు అంటూ జనాన్ని చివరిదాకా దగా చేసి ఆఖరికి పలాయనం చిత్తగించారు.

రాష్ట్రం విడిపోక తప్పని పరిస్థితి వచ్చాక, ప్రధానంగా హైదరాబాద్ వంటి మహానగరం అండ లేకపోవటం వల్లా, నదీజలాల విషయంలోనూ రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల ప్రజలకి, ముఖ్యంగా యువతకి ఎలాంటి నష్టం లేకుండా ఉండేందుకు కొన్ని పరిష్కార ప్రతిపాదనల్ని తయారుచేసి లోక్‌సత్తా పార్టీ గల్లీ నుంచి ఢిల్లీ వరకూ శక్తికి మించి కృషి చేసింది. జేపీ బృందం రాష్ట్రపతిని, కేంద్ర ప్రభుత్వ నేతలను, ప్రధాన ప్రతిపక్ష నేతలను పలుమార్లు కలిసి లోక్‌సత్తా సవరణలకు వారిని ఒప్పించింది.

అడ్డగోలుగా రాష్ట్రాన్ని నరికేద్దామనుకున్న కేంద్రం లోక్‌సత్తా కృషి వల్లనే చివరకి వెనక్కి తగ్గింది. లోక్‌సత్తా సవరణల్నే ప్రధానంగా తీసుకున్న బీజేపీ చివరకు రాజ్యసభలో వాటి కోసం పట్టుబట్టింది.

ఈవేళ రాష్ట్ర విభజన జరుగుతున్నా, మిగిలిన కోస్తా, సీమకి ఎటువంటి నష్టం లేకుండా, పదేళ్ల తర్వాత మూడు ప్రాంతాల తెలుగువారూ తలెత్తుకుని బతికేలాగా ఆర్థిక భవిష్యత్తుకి పూర్తి భరోసా లభిస్తోందంటే అది ప్రధానంగా లోక్‌సత్తా చేసిన కృషి వల్లే.

జేపీ ఎంతో ప్రయత్నం చేసి ఈ చారిత్రక సందర్భంలో మన కోసం మంచి ఫలితాలు సాధించారు. కానీ ఇవి చాలవు. మరెన్నో సాధించాలి. రాష్ట్ర విభజన వల్ల కలిగే సమస్యలను తొలగించటానికి జేపీ చేసిన ప్రయత్నాలు, సాధించిన విజయాలు ఇవీ.

**1. హైదరాబాద్ లేకపోతే మనకు ఉద్యోగాలు, వ్యాపారాలు ఎలా?**

**జేపీ పరిష్కారం :** హైదరాబాద్ భారతీయులందరిదీ. ఎవరైనా స్వేచ్ఛగా ఇక్కడ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవచ్చు. నానాటికీ తగ్గిపోతున్న ప్రభుత్వోద్యోగాలలో అవకాశం ఉండదుగానీ రోజురోజుకీ పెరిగే ప్రైవేటు ఉద్యోగాలకు ఏ సమస్యా ఉండదు. వెనకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమలో 20 ఏళ్ల పాటు పూర్తి పన్ను రాయితీలు ఇచ్చి, ఆ తర్వాత 30 ఏళ్లపాటు కూడా కొంతమేర కొనసాగించి, కృష్ణా డెల్టాలో రామాయపట్నం మేజర్ పోర్టుని కేంద్రమే ఏర్పాటు చేస్తే హైదరాబాద్ మీద ఆధారపడకుండా కోస్తా, సీమలో లక్షలమందికి ఉద్యోగాలు వస్తాయి.

**సాధించిన విజయం :** కేంద్ర ప్రభుత్వం దీనికి ఒప్పుకుంది. మనం అప్రమత్తంగా ఉంటూ ఒత్తిడి తెచ్చి అమలు చేయించుకోవాలి.

**2. హైదరాబాద్ ఆదాయం లేకపోతే ప్రభుత్వం నడిపేదెలా? జీతాలు ఎలా?**

**జేపీ పరిష్కారం :** తెలంగాణకి రాజధానిగా ఉండే హైదరాబాద్ ఆదాయాన్ని పంచుకుంటే చాలనుకుంటే మరోసారి నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఇది నష్టదాయకంగా మారుతుంది. కాబట్టి వచ్చే పదేళ్లూ మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడే లోటును పూడ్చటానికి కేంద్రం బడ్జెట్‌లో, ప్రణాళికా సంఘం ద్వారా గ్యారంటీ ఇవ్వాలి. హైదరాబాద్‌లోని మిగులు దక్కని కారణంగా వచ్చే రెవిన్యూ లోటుని భర్తీ చేయటం కేంద్రం బాధ్యత.

**సాధించిన విజయం :** ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుంది. రెవిన్యూ లోటుని భర్తీ చేస్తే ఆంధ్రప్రదేశ్‌కి వనరులు కొరత ఉండదు.

**3. వేగంగా రాష్ట్రాభివృద్ధికి భారీ నిధులు, పెట్టుబడులు ఎట్లా వస్తాయి?**

**జేపీ పరిష్కారం :** సుమారు 30 ఏళ్లపాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రులను అందించిన రాయలసీమ అత్యంత వెనకబడిన ప్రాంతంగా మిగిలిపోయింది. ఇంతకంటే ఎంతో మెరుగ్గా ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం రాష్ట్రాలకు ఎలాగైతే ప్రత్యేక ప్రతిపత్తి హోదా ఇచ్చి కార్పొరేట్, ఎక్సయిజ్, పెట్టుబడి, రవాణా, కేంద్ర పథకాలకు ప్రణాళికా నిధుల్లో రాయితీలు ఇస్తున్నారో అలాగే రాయలసీమకి కూడా ప్రత్యేక ప్రతిపత్తి హోదా కల్పించి ఇవ్వాలి. ఇంతవరకూ దక్షిణాదిన, ద్వీపకల్ప భారత దేశంలో ఇలాంటి ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలు లేవు. దీనివల్ల రాయలసీమకు బెంగళూరు, చెన్నై,

హైదరాబాద్, ముంబయి, పూణె వంటి ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చి భారీ పారిశ్రామిక అభివృద్ధి చోటుచేసుకుంటుంది. రాయలసీమ మరో దుబాయ్‌లా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

**సాధించిన విజయం :** ఏకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ఐదేళ్ల ప్రత్యేక ప్రతిపత్తికి కేంద్రం అంగీకరించింది. దీంట్లో చిక్కులు రాకుండా మనం ఒత్తిడి తెచ్చి పదేళ్ళకు పెంచుకోవాలి.

**4. హైదరాబాద్‌లో నివాసం వుంటున్న కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల భద్రత?**

**జేపీ పరిష్కారం :** రాజ్యాంగం ఇందుకు గ్యారంటీ ఇస్తున్నా, మానసిక భరోసా కోసం హైదరాబాద్ పరిధిలో శాంతిభద్రతలను గవర్నర్‌కిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి.

**సాధించిన విజయం :** దీన్ని ప్రభుత్వం చట్టంలో చేర్చింది. ఒకవేళ కోర్టులు దీన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిస్తే, తగిన రాజ్యాంగ సవరణ కూడా చేస్తామని ప్రభుత్వం, ప్రతిపక్ష బీజేపీ కూడా అధికారికంగా అంగీకరించాయి.

**5. హైదరాబాద్‌లో వున్న విద్యాసంస్థలలో ప్రవేశాలు కోల్పోతే ?**

**జేపీ పరిష్కారం :** పదేళ్ల పాటు హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలలో కోస్తా, సీమ విద్యార్థులను స్థానికులుగానే గుర్తించాలి.

**సాధించిన విజయం :** ప్రభుత్వం అంగీకరించింది.

**6. మిగులు జలాల మీద నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు ఆగిపోతాయేమో?**

**జేపీ పరిష్కారం :** మిగులు జలాల ఆధారంగా ఇప్పుడు నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టుల్నీ నికరజలాల ఆధారంగా కొత్త రాష్ట్రం అడ్డుకోకుండా చట్టబద్ధ ఏర్పాట్లు.

**సాధించిన విజయం :** కేంద్రం ఒప్పుకుంది. తెలంగాణ, మిగిలిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఒకరి ప్రాజెక్టులను ఇంకొకరు అడ్డుకోలేవు.

**7. పోలవరం పూర్తవుతుందా?**

**జేపీ పరిష్కారం :** పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుకు రెండు రాష్ట్రాలూ అంగీకరించినట్టుగా చట్టబద్ధ ఏర్పాట్లు చేసి, భద్రాచలం డివిజన్‌లోని ముంపు మండలాలను మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో కలపాలి.

**సాధించిన విజయం :** ప్రభుత్వం ఒప్పుకుంది.

**8. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల తక్షణ అభివృద్ధి ఎలా?**

**జేపీ పరిష్కారం :** ఈ రెండు ప్రాంతాలకీ ప్రత్యేకంగా అభివృద్ధి నిధులు కేంద్రం నుండి అదనంగా వచ్చే ఏర్పాటు చేయాలి.

**సాధించిన విజయం :** బుందేల్‌ఖండ్‌తో సమానంగా ఈ రెండు వెనకబడ్డ ప్రాంతాలకీ నిధుల్ని కేటాయించటానికి కేంద్రం అంగీకరించింది.

**9. కొత్త రాజధాని ఏర్పాటు, రాజధాని నుంచి హైదరాబాద్‌కి రవాణా ఎలా?**

**జేపీ పరిష్కారం :** రాజధాని నిర్మాణానికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి కేంద్రమే నిధులు ఇవ్వాలి.

**సాధించిన విజయం :** కేంద్రం ఒప్పుకుంది.

**10. సీమాంధ్ర ప్రాంతాల్లో విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు ఎలా?**

**జేపీ పరిష్కారం :** రెండింటికీ నిర్దిష్టకాలంలో పూర్తిచేసేందుకు కేంద్రం నిధులనివ్వాలి.

**సాధించిన విజయం :** కేంద్రం ఒప్పుకుంది.

ఈ సంక్షోభ సమయంలో కూడా ఈ ప్రాంతం ఎన్నుకున్న 175 మంది ఎమ్మెల్యేలు, 25 మంది ఎంపీలు ప్రజల్ని మోసం చేశారు. రాష్ట్రాన్ని కలిపివుంచలేకపోయారు, విడిపోవటం అనివార్యమైనప్పుడు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రయోజనాలనూ కాపాడలేకపోయారు. చివరిదాకా సమైక్యవాద హీరోలమంటూ నటించారు. మన ఓటును వేస్టు చేశారు.

మనం కోస్తా, సీమల్లో లోక్‌సత్తా పార్టీ తరపున ఒక్క

ఎమ్మెల్యేని, ఎంపీని గెలిపించకపోయినా, లోక్‌సత్తా పార్టీ తన శక్తికి మించి పనిచేసి ఈ ప్రాంతాల ప్రయోజనాలను కాపాడింది.

లోక్‌సత్తా కృషి వల్ల గతం కంటే ఇప్పుడు మరింత ఆర్థికబలం కోస్తాంధ్ర, రాయలసీమకు రాబోతోంది. కానీ సుమారు 1000 కిలోమీటర్ల తీరప్రాంతం, గుజరాత్ కంటే ఎక్కువ వర్షపాతం, అపార ఖనిజ వనరులున్న రాయలసీమ వంటి ప్రాంతం, అద్భుత చైతన్యం, ప్రతిభా పాటవాలు, ఎన్నో ఆకాంక్షలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సత్తా కలిగిన ప్రజలున్న సీమాంధ్రలో – విజయవాడ, కర్నూలు, శ్రీకాకుళం 30 ఏళ్ల క్రితం ఎలా ఉన్నాయో కొద్దిపాటి మార్పులు మినహా ఇప్పటికీ అలాగే ఉన్నాయి. భూముల కబ్జాలో, అవినీతిలో తప్ప ఎక్కడా పురోగతి లేదు. రైతులకి లాభసాటి ధర రాదు, పిల్లలకి మంచి చదువు అందదు, యువతకు మంచి ఉద్యోగాలు వచ్చేందుకు పరిశ్రమలు లేవు. చేసిన కాస్త అభివృద్ధినీ హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకరించటం వల్లే ఈవేళ ఆరు కోట్ల ఆంధ్రుల జీవితాలలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఇందుకు కారణమైన దోపిడీ, అవకాశవాద, వారసత్వ, విద్వేషపూరిత, అపరిపక్వ రాజకీయాల్ని మార్చుకోకపోతే భవిష్యత్తులోనూ మరో సంక్షోభం రావొచ్చు. అందుకే ...



విభజన బాధను అధిగమించి భవిష్యత్తుని ఒక సవాలుగా తీసుకుని, రాజకీయాన్ని మార్చుకోవాలి. నిజాయతీ, పరిణతి, సామర్థ్యంగల నాయకత్వాన్ని పెంపొందించుకుని, ఓటు వేస్టుపై భ్రమల్ని పక్కనబెట్టి సరైన అభ్యర్థికి, పార్టీకి ఓటు వేస్తేనే మన భవిష్యత్తు బంగారం అవుతుంది. తెలుగుతేజం మరింత పెరుగుతుంది. ఓటు ఎవరికి వేస్తే వృథా అవుతుందో ఇప్పుడు ప్రజలు ఆలోచించుకోవాలి.

ఇప్పుడు యువతరం భవిష్యత్తుకి భరోసా కావాలి. పెద్దఎత్తున పారిశ్రామికీకరణ జరగాలి. ప్రతి బిడ్డకీ మంచి విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ఆరోగ్యం జేబులో ఖర్చు లేకుండా అందాలి. ప్రతి యువకుడికి, యువతికీ ఉపాధి దొరకాలి, ఆదాయం రావాలి, బీదరికం అంతం కావాలి. మద్యం మహమ్మారికి ఏ కుటుంబం బలి కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లుండాలి. స్వంత కాళ్ల మీద బతుకుతూ రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకి ఆత్మగౌరవం, భద్రత కావాలి. మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో పూర్తి పాత్ర తీసుకునేలా రక్షణ, అవకాశాలు రావాలి. ప్రభుత్వ కార్యాలయాలలో లంచం, వేధింపులు లేకుండా వెంటనే పనులు జరగాలి. మన పన్నుల డబ్బులో మన ఊళ్ళో వాటా దక్కి, ఎక్కడి నిర్ణయాలు అక్కడే తీసుకునే ఏర్పాట్లుండాలి.

ఇవన్నీ మన ప్రజాస్వామ్య హక్కులు. ఈ హక్కులన్నీ మనకి దక్కాలంటే, మన పిల్లల భవిష్యత్తుని కాపాడుకోవాలంటే, మళ్లీ తెలుగు జాతికి దుష్ట రాజకీయం వల్ల ఏ ప్రమాదం రాకుండా ఉండాలంటే, సమాజం కులాల కురుక్షేత్రంగా మారకుండా శాంతి, సామరస్యం ఉండాలంటే, మన రాజకీయాన్ని మార్చుకోవాలి. కుటుంబ పాలన, డబ్బు చుట్టూ తిరిగే రాజకీయం, అవినీతి, తాత్కాలికమయిన తాయిలాలు, కులం, మతం, ప్రాంతం పేరుతో విభజనలు– వీటిని అంతం చేయాలి. గతాన్ని పీడకలగా మర్చిపోవాలి. అందమైన భవిష్యత్తుకి పునాదులు వేసుకుందాం. కలిసిరండి. ◆

**– వై.డి. రామారావు, కె. ఓంకార్**

*(లోక్‌సత్తా పార్టీ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతీయ ఉపాధ్యక్షులు)*

# ఒకే లక్ష్యం.. అభివృద్ధి

- మేధావులు, పారిశ్రామికవేత్తలు, ఇన్వెస్టర్ల భాగస్వామ్యం
- ప్రతి జిల్లాకు ప్రత్యేక వ్యూహం
- ఇన్వెస్టర్లకు సహకరించేందుకు, ఆకట్టుకునేందుకు కో ఆర్డినేటర్ల వ్యవస్థ
- కనీసం రెండు మూడు హైదరాబాద్ స్థాయి నగరాల అభివృద్ధి
- 'కోస్తా రాయల డెవలప్‌మెంట్ ఫోరం' చీఫ్ కో ఆర్డినేటర్ హరీష్ చంద్రప్రసాద్

ఇప్పుడిక సందేహాలు, అనుమానాలు ఏమీ లేవు. ఆంధ్రప్రదేశ్ విభజన నిజమైంది. హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ, 13 జిల్లాలలో అవశేష ఆంధ్రప్రదేశ్.. ఇవి రెండూ తెలుగు రాష్ట్రాలు. రెండు కొత్త రాష్ట్రాలు సరే.. అభివృద్ధి మాటేమిటి? ప్రజల ఆకాంక్షల సంగతేమిటి? దీనిని పూర్తిగా రాజకీయ నాయకులకు వదిలిపెట్టాలా? లేక ప్రజాభాగస్వామ్యంతో ముందుకు సాగాలా? ఈ ఆలోచనలతోనే కోస్తా, రాయలసీమ ప్రాంతానికి చెందిన కొందరు పారిశ్రామికవేత్తలు, మేధావులు ఒక వేదికగా ఏర్పడి తెలంగాణ మినహా ఏర్పడుతున్న ఆంధ్రప్రదేశ్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయడంపై దృష్టి సారించారు. ఇందుకోసం **'కోస్తారాలయ డెవలప్‌మెంట్ ఫోరమ్'** పేరుతో ఒక్కతాటిపైకి వచ్చారు. ఈ ఫోరమ్ చీఫ్ కో ఆర్డినేటర్ ప్రముఖ పారిశ్రామికవేత్త, మాలక్ష్మీ గ్రూప్ ఛైర్మన్ యార్లగడ్డ హరీష్ చంద్రప్రసాద్ ఫోరమ్ నేపథ్యాన్ని, తమ కార్యక్రమాలను, ఆలోచనలను ఆయన వివరించారు.

**సిడి ఫోరమ్ ఎందుకు, మీ ఆలోచన ఏమిటి?**

హైదరాబాద్ కేంద్రంగా సాగిన సోకాల్డ్ అభివృద్ధి కారణంగా సంయుక్త రాష్ట్రంలో అలాంటి నగరం మరొకటి వృద్ధిలోకి రాలేదు. 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ ముందు అనేక సవాళ్లున్నాయి. రాజకీయ నాయకులే వీటిని పరిష్కరిస్తారని మేం భావించడం లేదు. రాజధాని నిర్మాణంతో పాటు, ఉత్తరాంధ్ర, రాయలసీమ, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల (కెజిపిజి)తో కూడిన కోర్ ఆంధ్ర.. అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి సమంగా జరగాలి. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య అసంతృప్తికి అవకాశం ఇవ్వకూడదు. ఇందుకోసం సమగ్ర వ్యూహం తయారు చేయాలి. అంతకంటే సమగ్రమైన కార్యచరణతో ముందుకు సాగాలి. రాజకీయాలకు అతీతంగా ఈ కృషి సాగాలి. ఇందుకు ప్రజల భాగస్వామ్యం కావాలి. ముఖ్యంగా ఈ ప్రాంతానికి చెందిన మేధావులు, పారిశ్రామికవేత్తలను కలుపుకుని పోవాలి. ఇందుకోసం ఏర్పాటైందే కోస్తారాయుల డెవలప్‌మెంట్ ఫోరమ్.



రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని సంస్థ. రాజకీయ నాయకులు ఎవరైనా ఫోరమ్‌లో జాయిన్ కావచ్చు. కానీ ఫోరమ్ వేదికగా రాజకీయాలు మాట్లాడటం మాత్రం నిషేధం. మా వెబ్‌సైట్ cdforum.in. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా సరే తమ అభిప్రాయాలను, ఫీడ్‌బ్యాక్‌ను తెలియజేయవచ్చు.

**ఫోరమ్ ఎలా పనిచేస్తుంది.. నిధులు ఎలా?**

ఇది పూర్తిగా స్వచ్ఛంద సంస్థ. మాతో పనిచేసేవారంతా కూడా స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిందే. ప్రతి జిల్లాలోనూ పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించడం, తదనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు వెసులుబాటు కల్పించడం ఫోరమ్ సభ్యుల విధి. ఇందుకోసం ప్రతి జిల్లాకు ఒక కో ఆర్డినేటర్ ఉంటాడు. అలాగే ఐటి, ఫార్మా, ఇన్‌ఫ్రా.. వగైరా ప్రతి పారిశ్రామిక విభాగానికి ఒక కో ఆర్డినేటర్ ఉంటాడు. వీరు కాకుండా రీజినల్ కో ఆర్డినేటర్స్ ఉంటారు. అమెరికాతో సహా తెలుగువారున్న అన్ని దేశాల్లోనూ కో ఆర్డినేటర్స్ నెట్‌వర్క్ ఉంటుంది. అమెరికాలో నాలుగు ప్రాంతాలకు నలుగురు కో ఆర్డినేటర్లు ఉంటారు. మనదేశంలో కూడా ఇతర రాష్ట్రాల్లో ఈ కో ఆర్డినేటర్ల వ్యవస్థ ఉంటుంది. ఇన్వెస్టర్లను ఆకర్షించడం, వారికి అవసరమైన సమాచారాన్ని

ఇవ్వడం, కొత్త ప్రభుత్వం సహకారంతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం.. ఫోరమ్ చేస్తుంది.

**సీమాంధ్ర జిల్లాల్లో ఇప్పుడు అభివృద్ధి లేదా?**

భారత్ 8 శాతం వృద్ధితో దూసుకుపోతున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ వృద్ధిరేటు 12 శాతం. విశాఖ మినహాయిస్తే సీమాంధ్రలో సగటు వృద్ధిరేటు ఆ సమయంలో 5 శాతం మాత్రమే. మరి ఈ వృద్ధిరేటు ఎక్కడ్నించి వచ్చిందంటే.. హైదరాబాద్ నుంచి మాత్రమే. మిగిలిన తెలంగాణ జిల్లాల పరిస్థితి భిన్నంగా ఉందని అనుకోవడం లేదు.

**తెలంగాణకు మీ ఎజెండాలో ఎలాంటి స్థానం ఉంటుంది?**

రెండు రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందాలి. రెండు రాష్ట్రాల్లో సానుకూల అంశాలు, ప్రతికూల అంశాలను క్షుణ్ణంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం ఉండాలి. సమన్వయంతో పరస్పర పూరకంగా పనిచేయాలి. బలాలు, బలహీనతలు రెండు రాష్ట్రాల్లోనూ ఉన్నాయి.

ఉదాహరణకు తెలంగాణ విషయానికి వస్తే.. విద్యుత్ కోతలు ఎక్కువ, నీటిపారుదల సౌకర్యం తక్కువ, బోరు బావుల ఆధార వ్యవసాయం, తీవ్రవాద ఉద్యమాలు.. వీటిని కొత్త ప్రభుత్వం అడ్రస్ చేయాల్సి వుంటుంది. ఇక బలం విషయానికి వస్తే, యాంకర్ సిటీ హైదరాబాద్.. కొత్త ఇన్వెస్ట్‌మెంట్ల ఆకర్షణకు సర్వసన్నద్ధంగా ఉన్న నగరం. ఇన్‌ఫ్రా బాగా డెవలప్ అయింది. అనుకూలమైన వాతావరణం, హిందీ మాట్లాడే జనాభా, నైపుణ్యం ఉన్న లేబర్, వ్యాపారాలకు అవసరమైన ఎకో సిస్టమ్ సిద్ధంగా ఉంది. ఇక కొత్త ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. బిజినెస్ డెవలప్‌మెంట్‌కు అవసరమైన ఎకో సిస్టమ్ లేదు. ఇన్‌ఫ్రా అంతంతమాత్రమే. భౌగోళిక స్వరూపం కూడా దీర్ఘంగా ఉంటుంది. వ్యవసాయ ఆధారిత ఆలోచనా విధానమే డామినెట్ చేస్తుంటుంది. నాయకుల్లో ప్రాంత, కుల పరమైన సంకుచితత్వం.. ఇవన్నీ బలహీనతలు. పొడవైన కోస్తా తీరం, చమురు, సహజవాయువుతో సహా అందుబాటులో సహజ వనరులు. మిగులు విద్యుత్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, దండిగా భూముల లభ్యత ఉన్న గ్రోత్ కారిడార్స్.. స్కిల్డ్ లేబర్, తాజాగా కేంద్రం ప్రకటించిన పన్ను రాయితీలు.. ఇవన్నీ సానుకూల అంశాలే. బలాలను ఉపయోగించుకుంటూ, బలహీనతలను అధిగమించాల్సి వుంటుంది. నిజాయితీ గల గట్టి నాయకత్వం లభిస్తేనే రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి.

**కొత్త రాజధాని వివాదంగా మారే అవకాశం ఉందా?**

ఇప్పటికే ఆ సమస్య కనిపిస్తోంది. భౌగోళికంగా రాష్ట్రం మధ్యలో రాజధాని ఉండాలని భావించడం కంటే కూడా జనసాంద్రతను పరిగణనలోకి తీసుకుని (డెమోగ్రాఫికల్) మధ్యలో ఉండేట్టుగా రాజధానిని నిర్మించాలన్నది మా సూచన. రాజధానిని అల్లుకుని ఆర్థిక లాభాలను ఆశిస్తున్న శక్తులను దూరం పెట్టాలి. ఇందుకు మా నుంచి కొన్ని ప్రతిపాదనలున్నాయి. కొత్త రాజధాని కేవలం అడ్మినిస్ట్రేటివ్ క్యాపిటల్‌గా ఉండాలి. రైల్వే సౌకర్యం, ఎయిర్‌పోర్టు, నీటి సౌకర్యం ఉండాలి. అందుబాటులోని ప్రభుత్వ భూమి 3,000-5,000 ఎకరాల లోపు మాత్రమే ఉండాలి. సాగుభూమి ఒక్క ఎకరా కూడా ఉపయోగించకూడదు. ఈ నగరం చుట్టూ 25 కిలోమీటర్ల పరిధిలో పారిశ్రామిక విస్తరణ, రియల్ వ్యాపార విస్తరణపై ఆంక్షలు విధించాలి. ఒక్క హైదరాబాద్ వల్ల ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన తప్పు జరగకుండా కొత్త రాష్ట్రంలో రెండు మూడు హైదరాబాద్ స్థాయి నగరాలను డెవలప్ చేయాలి. ఇందుకోసం వైజాగ్, నెల్లూరు, తిరుపతి, రాజమండ్రి, విజయవాడ.. నగరాలను గుర్తించాలి. కర్నూలు, విశాఖలో హైకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేయాలి.

**ఫోరమ్ రాజకీయ నాయకులను ఎలా కలుపుకుపోతుంది?**

ప్రజల ఆకాంక్షలకు నాయకుల చేతలకు మధ్య అంతరం ఉండకూడదు. అందువల్ల రాజకీయ నాయకులను కూడా కలుపుకుపోతున్నాం. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేతలతో ముఖాముఖి గోష్టి నిర్వహిస్తాం. మొదట అందరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చి భారీ స్థాయి చర్చాగోష్ఠి నిర్వహించాలని భావించాం. అయితే, నాయకులంతా ఒకే వేదికను పంచుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో విడివిడిగానే సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ఇదికాకుండా ఎన్నికల ముందు ప్రతి టౌన్‌లోనూ ఎన్నికల చర్చలను నిర్వహిస్తాం. నాయకులను ఆహ్వానించి వారి కమిట్‌మెంట్స్‌ను ప్రజాసమక్షంలో రాబట్టంతో పాటు కాగితంపై రాయించి సంతకాలు తీసుకుంటాం. నేతలు పూర్తిగా ప్రజాసేవకే అంకితం కావాలి. సొంత వ్యాపారాలు ఉండకూడదు. కొంతకాలం పాటైనా నేతలంతా అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలన్నది మా ఆకాంక్ష. ◆

# వారేమీ పైనుంచి ఊడిపడలేదు

- **అవినీతికేసుల్లో ప్రజాప్రతినిధులకు రక్షణా..**
- **చట్టం కంటే ఎవరూ ఎక్కువ కాదు**
- **అందరూ సీఆర్‌పీసీని అనుసరించాల్సిందే**
- **1999 నాటి ప్రభుత్వ మెమోపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**

అవినీతి కేసుల్లో ప్రజాప్రతినిధులపై ఏసీబీ నేరుగా చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం మెమో జారీ చేయడంపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. చట్టం కంటే ఎవరూ ఎక్కువ కాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. సామాన్యులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య కేసుల వ్యవహారంలో వివక్షత ఎందుకని ప్రభుత్వాన్ని నిలదీసింది. వారేమైనా పైనుంచి ఊడిపడ్డారా? అంటూ వ్యాఖ్యానించింది. ఎగ్జిక్యూటివ్ అధికారులు ప్రజాప్రతినిధులను రక్షించడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించింది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం ప్రజాప్రతినిధులకు ప్రత్యేక రక్షణేమైనా ఉందా? అంటూ ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ మెమో చట్టబద్ధతను సమర్థించుకునే విషయంలోనూ ప్రభుత్వం విఫలమయ్యిందని ధర్మాసనం పేర్కొంది.




రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం సిండికేట్ల కేసులో బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన ఓ.ఎం.దబేరా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మద్యం కేసుల వ్యవహారంలో దర్యాప్తు పూర్తై.. ఛార్జిషీట్లు కూడా దాఖలు చేశామని ఏసీబీ కోర్టుకు తెలిపింది. ఈ కేసును దర్యాప్తు చేసిన 'ప్రత్యేక దర్యాప్తు బృందం'లోని అధికారులను బదిలీ చేయడానికి అనుమతి పొందింది. ప్రజాప్రతినిధులను మినహాయించి మిగిలిన వారిపై కేసులు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ.. పిటిషనర్ హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కల్యాణ్ జ్యోతి సేన్‌గుప్తా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది.

పిటిషనర్ తరపున న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. అవినీతి ఆరోపణలు వచ్చిన ప్రజాప్రతినిధుల విచారణ వ్యవహారంలో డిసెంబరు 29, 1999లో అప్పటి ప్రభుత్వం ఓ మెమోను జారీ చేసిందని కోర్టుకు విన్నవించారు. అది రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను ఉల్లంఘించేదిగా ఆ మెమో ఉందన్నారు. ప్రజాప్రతినిధుల మీద అవినీతి ఆరోపణలు వస్తే.. అవినీతి నిరోధక శాఖ 'కేవలం ప్రాథమిక దర్యాప్తు' జరిపి నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని మెమో పేర్కొంటోందన్నారు. ఆ నివేదిక ప్రకారం ప్రభుత్వం ఓ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేస్తుందని.. ఏసీబీ నివేదికతో అడ్వయిజరీ కమిటీ ఏకీభవిస్తే.. అప్పుడు ప్రజాప్రతినిధులపై చర్యలకు ఉపక్రమించేలా సంబంధిత మెమో ఉందని న్యాయవాది కోర్టుకు విన్నవించారు. మద్యం సిండికేట్ల కేసులో మెమో ప్రకారం ఇప్పటివరకు అడ్వయిజరీ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదన్నారు. సంబంధిత మెమోను పరిశీలించిన ధర్మాసనం ప్రభుత్వ తీరుపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేసింది. కేసుల దర్యాప్తు వ్యవహారంలో అందరూ సీఆర్‌పీసీని అనుసరించాల్సిందేనని స్పష్టం చేసింది. గూండాలు, మోసగాళ్లను సీఆర్‌పీసీ కింద విచారిస్తున్నప్పుడు.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులపై దర్యాప్తు చేయకుండా ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకుంటుందని వ్యాఖ్యానించిన ధర్మాసనం ఏసీబీ విచారణ కొనసాగించాల్సిందేనని ఆదేశం ఇచ్చింది. ◆

# ఆల్ ఫ్రీ తాయిలాలు చెల్లవిక

ఏ మేరకు సబబో, ఎలా నెరవేరుస్తారో చెప్పాలి

- **వాటికి నిధుల లభ్యతను కూడా వివరించాలి**
- **నిబంధనలు కఠినతరం చేసిన ఎన్నికల సంఘం**
- **భారీ వాగ్దానాలు చేయొద్దంటూ పార్టీలకు ఆదేశం**

పార్టీలూ, బహుపరాక్! ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇష్టానుసారంగా ఉచిత వాగ్దానాలు కురిపిస్తామంటే, తాయిలాలు గుమ్మరిస్తామంటే, ఎలాగైనా గెలవడమే లక్ష్యంగా ఓటర్లను ప్రలోభపెడతామంటే ఇకపై కుదరదు. వాటన్నింటికీ పూర్తిస్థాయిలో లెక్కలు చెప్పాల్సిందే. వివరణలివ్వాల్సిందే. ఆయా హామీల హేతుబద్ధతను, వాటిని నెరవేర్చేందుకు కావాల్సిన ఆర్థిక వనరుల సమీకరణకు ఉన్న మార్గాలను వివరించి తీరాల్సిందే. ఎన్నికల బరిలో అన్ని పార్టీలకూ సమానావకాశాలుండేలా చూడాలన్న సుప్రీంకోర్టు నిర్ణయాలకు అనుగుణంగా ఈ దిశగా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టనుంది. పార్టీలేవీ భారీ వాగ్దానాలు చేయొద్దంటూ ఈసీ తన తాజా నిర్దేశకాల్లో ఇప్పటికే పేర్కొంది. "అలాంటి వాగ్దానాలతో ఓటర్లను అనుచితంగా ప్రలోభపెట్టరాదని, పార్టీలన్నింటికీ సమానావకాశాలు కల్పించే వాతావరణాన్ని పాడుచేయరాదు. అమలుకు, ఆచరణకు సాధ్యమైన, నెరవేర్చగల వాగ్దానాలతో మాత్రమే ఓటర్ల ముందుకు వెళ్లాలి. వారి ఓట్లను అడగాలి" అని స్పష్టం చేసింది. అంతేకాదు, ఈ నిర్దేశకాలను ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో కూడా చేర్చింది. అంటే ఇకపై పార్టీలన్నీ వాటిని తూచా తప్పకుండా పాటించాల్సిందేనన్నమాట. ఎన్నికల మేనిఫెస్టోలో హామీలివ్వడం చట్టపరంగా అవినీతి కాకపోయినా ఎలాంటి ఉచిత వాగ్దానాలు చేసినా అవి ప్రజలను ప్రభావితం చేస్తాయని సుప్రీంకోర్టు 2013 జూలై 5న ఇచ్చిన తీర్పులో పేర్కొంది. సజావుగా, స్వేచ్ఛాయుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ లక్ష్యాలనే అది చాలావరకు దెబ్బ తీస్తుందని ఆందోళన వెలిబుచ్చింది. ఈ దృష్ట్యా, "ఎన్నికల బరిలో ఉన్న అన్ని పార్టీలకూ, అభ్యర్థులకూ సమానావకాశం ఉండేలా జాగ్రత్తలు తీసుకోండి. ఎన్నికల ప్రక్రియ నీరుగారకుండా చూడండి" అని ఈసీకి సూచించింది. ఈ నేపథ్యంలో ఈసీ తాను రూపొందించిన నిర్దేశకాల ముసాయిదాను పార్టీలకు పంపింది. ఫిబ్రవరి 7న పార్టీలతో సమావేశమైంది. ముసాయిదాలోని చాలా నిబంధనలను పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. ఓటర్లకు వాగ్దానాలు చేయడం తమ హక్కు అని వాదించాయి. అవి వ్యక్తం చేసిన అభిప్రాయాలను కూడా పొందుపరుస్తూ తాజా నిర్దేశకాలను రూపొందించి వాటిని ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో పొందుపరిచింది. వాటిలోని ముఖ్యాంశాలు...

- రాజ్యాంగంలో పేర్కొన్న విలువలకు, ఆదర్శాలకు విరుద్ధంగా ఉండే ఎలాంటి అంశాలూ పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలో ఉండరాదు.
- ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో పొందుపరిచిన ఇతరత్రా అన్ని నిబంధనలనూ తూచా తప్పకుండా ఆచరించేలా మేనిఫెస్టో ఉండాలి.
- పౌరుల సంక్షేమం కోసం రాజ్యాంగమే ప్రత్యేకంగా ఆదేశిక సూత్రాలను పొందుపరిచింది. వాటి సాధనకు ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. కాబట్టి అలాంటి సంక్షేమ పథకాలను మేనిఫెస్టోల్లో పొందుపరిచేందుకు అభ్యంతరమేమీ ఉండబోదు. కాకపోతే ఎన్నికల ప్రక్రియ తాలుకు స్వచ్ఛతను దెబ్బతీసే, ఎవరికి ఓటేయాలనే విషయంలో ఓటర్లను ప్రలోభానికి గురి చేసే వాగ్దానాలకు మాత్రం పార్టీలు దూరంగా ఉండాలి. ◆

# రోగమొకటి... మందొకటి!

దేశంలో వైద్యవిద్య సంస్కరణలు దారి తప్పుతున్నాయి. రోగమొకటైతే మందు మరొకటన్న చందంగా భారతీయ వైద్యమండలి (ఎంసీఐ) వ్యవహరిస్తోంది. దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వమూ అందుకు వత్తాసు పలుకుతోంది. వైద్యవిద్యలో నానాటికీ ప్రమాణాలు దిగజారిపోతున్నాయంటూ ఒకవైపు విమర్శలు వెల్లువెత్తుతున్నా.. శిక్షణ కాలాన్ని కుదించడానికే కేంద్రం సమాయత్తమవుతోంది. గ్రామాల్లో వైద్యసేవలు అందించడం ఇక మీదట డాక్టర్లకు తప్పనిసరి కాదని కేంద్ర ఆరోగ్యమంత్రి గులాంనబీ ఆజాద్ ఇటీవల చేసిన ప్రకటన గ్రామీణ వైద్యరంగాన్ని ఉసూరుమనిపించేదే. ఎంబీబీఎస్ పట్టభద్రులు స్నాతకోత్తర విద్య (పోస్ట్ గ్రాడ్యుయేషన్) చదవాలంటే ఏడాదిపాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాల్సిందేనంటూ ఎంసీఐ నిరుడు జూన్‌లో నిర్ణయం తీసుకుంది. గ్రామీణ వైద్య సేవలకు వీలుగా ఎంబీబీఎస్ కోర్సు కాలపరిమితి పెంచాలనీ నిర్ణయించారు. ఈ నిర్ణయం 2014-15 విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలనుకున్నారు. దీనిపై ముఖ్యంగా ఢిల్లీలో వైద్యవిద్యార్థులు తీవ్రస్థాయి ఉద్యమం చేపట్టడంతో ప్రభుత్వం దిగివచ్చింది. ఆ నిర్ణయాన్ని తిరగదోడనున్నట్లు ఆజాద్ హామీ ఇచ్చాకకానీ, ఉద్యమం చల్లారలేదు. వైద్యవిద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించడానికి ఎందుకు విముఖంగా ఉన్నారో తెలుసుకుని, సానుకూల పరిస్థితులు కల్పించే బదులు.. సర్కారు చివరకు గ్రామీణ వైద్యాన్నే పడకెక్కించేందుకు నడుంకట్టడం ఆక్షేపణీయం.

**దారి తప్పుతున్న వైద్యవిద్య సంస్కరణలు**



### ప్రమాణాల క్షీణత

ఆరోగ్య రంగంలో వైద్యులదే కీలకపాత్ర. మౌలిక వసతులలేమి, సిబ్బంది కొరత సమస్యకన్నా వైద్యులు లోటు తీవ్రతరమైంది. ఆపత్కాలంలో వైద్యుల అందుబాటు ఎందరో రోగులకు ప్రాణదానం చేస్తుంది. అందుకే, వృత్తి విద్యాకోర్సుల్లో వైద్యవిద్య ఉత్కృష్టమైనదిగా గుర్తింపు పొందింది. దేశవ్యాప్తంగా ఏటా ఆరున్నర కోట్లమంది వైద్యవిద్య ప్రవేశ పరీక్షలకు హాజరవుతుంటారు. వారిలో అయిదోవంతుకు మాత్రమే ప్రవేశ భాగ్యం దక్కుతోంది. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే వారి సంఖ్య ఏటేటా ఇంతలంతలవుతోంది. మరోవంక వైద్యవిద్యలో ప్రమాణాలు మాత్రం పెరగడం లేదు. దేశంలో అతికొద్ది వైద్య కళాశాలలే ప్రమాణాలపరంగా తమ విశిష్టత చాటుకుంటున్నాయి. మిగిలినవి నామమాత్రంగా నడుస్తున్నాయి. వైద్యవిద్యకు మార్గదర్శిగా నిలవాల్సిన ఎంసీఐలోనే విలువల క్షీణత కనిపిస్తోంది. వరసగా వెలుగుచూస్తున్న కుంభకోణాలు మండలి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అమెరికా, చైనా, బ్రిటన్ వంటి దేశాల్లో వైద్యమండళ్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వైద్యవిద్యను ఎప్పటికప్పుడు పటిష్ఠంగా తీర్చిదిద్దడానికి నిరంతర కృషి జరుపుతున్నాయి. వైద్యవిద్య సంస్కరణల్లో మేధావులకు, విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తున్నాయి. మనదేశంలో సంస్కరణలు ఏకపక్షంగా మారాయి. అధికశాతం కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఫలితంగా వైద్యవిద్యకు, ఆరోగ్య రంగానికి మధ్య దూరం పెరుగుతోంది. ఫలితంగా రోగులకు అందజేయాల్సిన సేవలపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

## నాసిరకం బోధనలు

దేశంలో వైద్యకళాశాలల సంఖ్య ఏటా పెరుగుతోంది. రాష్ట్రంలోనూ కొత్తగా పది వైద్యకళాశాలలకు అనుమతులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయినా, అటు దేశంలో ఇటు రాష్ట్రంలో వైద్యుల కొరత తీరడం లేదు. ప్రజావసరాలకు దీటుగా వైద్యులు తయారు కావడం లేదు. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందజేసే సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 63 శాతం పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. వైద్యవిద్యలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండటం, ప్రతిభావంతులు విదేశీబాట పట్టడం మొత్తంగా పరిస్థితిని మారుస్తున్నాయి. వైద్యవిద్యలో తాతలకాలం నాటి విధానాలే నేటికీ కొనసాగుతున్నాయి. కాలానుగుణంగా వైద్యవిద్యలో మార్పులు రావాలి. ఆ దిశగా ఎలాంటి మార్పులూ చోటుచేసుకోవడం లేదు. ఎంబీబీఎస్‌లో అయిదున్నరేళ్ల శిక్షణ విధానం అమలులో ఉంది. వైద్యకళాశాలల్లో అసౌకర్యాలు, బోధకుల కొరత, నాసిరకం బోధనలకు తోడు అధికారుల పర్యవేక్షణ లోపంవల్ల విద్యాప్రమాణాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. దేశంలోని వైద్యకళాశాలల్లో నిపుణుల పోస్టులో 29 శాతం మేరకు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులకు ప్రొఫెసర్ల ద్వారా బోధన జరగాలి. చాలా చోట్ల పీజీ విద్యార్థులనే బోధనకు పురమాయిస్తున్నారు. వివిధ రకాల వ్యాధులతో ఆసుపత్రులకు వచ్చే రోగులను పరీక్షించే విధానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. అదీ జరగడం లేదు. కొన్ని విభాగాల్లో మాత్రమే పూర్తిస్థాయి తరగతులు నిర్వహిస్తున్నారు. 'స్పెషాలిటీ' విభాగాల్లో పనిచేస్తున్న పలువురు బోధకుల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. వైద్యవిద్యలో పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులకూ పూర్తిస్థాయిలో విద్యాబోధన, రోగనిర్ధారణ శిక్షణ, శస్త్ర చికిత్సల విషయంలో మెరుగైన సూచనలు లభించడంలేదు. శస్త్ర చికిత్సల విషయంలో ప్రొఫెసర్లు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేటు వైద్య కళాశాలల్లో శిక్షణలో ప్రమాణాలు లోపిస్తున్నాయి. అర్హతలు లేనివారు సైతం బోధకులుగా చలామణీ అవుతున్నారు. వైద్యకళాశాలల్లో సీట్లకు అనుమతులు ఇచ్చి ఎంసీఐ చేతులు దులుపుకొంటోంది. కళాశాలల నిర్వహణ, విద్యాబోధనపై సమీక్షలు జరపడం లేదు. ఏటా జరగాల్సిన తనిఖీల కార్యక్రమం ప్రహసనప్రాయ మవుతోంది.

## చైనా ఆదర్శం

చైనాలో వైద్యవిద్య పరిధి ఎంతో విస్తృతం. అక్కడి మారుమూల ప్రాంతాల్లోని ఆసుపత్రులు సైతం వైద్యకళాశాలలతో అనుసంధానమై ఉంటాయి. వైద్యవిద్యార్థులందరూ గ్రామాల్లో విధిగా సేవలు అందజేస్తారు. మనదేశంలో వైద్యవిద్యను కేవలం బోధనాసుపత్రులకే అనుసంధానించారు. ప్రతి ఆసుపత్రిలో సాధ్యమైనంత ఎక్కువ సమయం రోగులను పరీక్షించి, చికిత్స అందించడం ద్వారా ప్రొఫెసర్లు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. చాలామంది బోధకులు మొక్కుబడి శిక్షణకే పరిమితమవుతున్నారు. చైనాలోని బోధనాసుపత్రుల్లో ఉదయం, సాయంత్రం రోగులను-ప్రొఫెసర్, అసోసియేట్ స్థాయి వైద్యులు రెండుసార్లు పరీక్షిస్తుంటారు. మనదేశంలో ఉదయం పూటే వైద్యనిపుణులు కనిపిస్తారు. సాయంత్రం, రాత్రి వేళల్లో వారు అందుబాటులో ఉండటం లేదు. వారంలో కొన్ని రోజులే రోగులకు అందుబాటులో ఉంటున్నారు. వివిధ విభాగాల వైద్యనిపుణుల మధ్య సమన్వయం చాలా సందర్భాల్లో లోపిస్తుంది. వైద్యరంగంలో వస్తున్న ఆధునిక విధానాలపై తరచూ సదస్సులు నిర్వహించి, విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. ఇదీ అరుదుగా మారింది. అనేక వైద్యకళాశాలల్లో గ్రంథాలయాలు సరిగా లేవు.



కంప్యూటర్ల వంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటూ అరకొరగా ఉంటోంది.

**పల్లెలపై చిన్నచూపు**

దేశంలో గ్రామీణ ఆరోగ్యరంగం దయనీయం ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 68 శాతం వరకు గ్రామాల్లోనే జీవిస్తున్నారు. వారికి సరైన వైద్యసేవలు అందడం లేదు. భారత్‌లో ఏటా 28 వేలమంది వైద్యులు కళాశాలల నుంచి బయటికి వస్తున్నా అందులో 15 శాతం నుంచి 20 శాతమే గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను మెరుగుపరచడానికి ఎంబీబీఎస్ శిక్షణలో భాగంగా పల్లెల్లో ఒక ఏడాది విధిగా పనిచేసే విధానం అనుసరించాలని, ఇందుకోసం పాఠ్య ప్రణాళికను సవరించాలనీ సూచించారు. దీని ప్రకారం ప్రతీ విద్యార్థి నాలుగేన్నరేళ్ల విద్యా కోర్సు, ఆ తరవాత ఆస్పత్రిలో 'ఇంటర్న్‌షిప్' పూర్తయ్యాక పూర్తిపట్టాపొందే ముందు ఏడాదిపాటు గ్రామీణ ప్రాంతంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. అప్పటిదాకా పట్టాను 'తాత్కాలికం'గానే పరిగణిస్తారు. ఈ కాలవ్యవధిలో వైద్యవిద్యార్థులు సమీపంలోని కళాశాలకు, గ్రామీణ ఆస్పత్రికి అనుసంధానంగా ఉంటూ, సీనియర్ వైద్యుల మార్గనిర్దేశకత్వంలో పనిచేయాలి. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదు. విదేశాల్లో ఓ వైద్యుడు రోగులకు మందులు రాసే దశకు చేరుకోవడానికి ఏడేళ్లు అంతకన్నా ఎక్కువ సమయం పడుతోంది. ఆయా దేశాల్లో శిక్షణలో భాగంగానే మానవతా దృక్పథాన్ని, సేవాభావాన్ని నూరిపోయడం వల్ల కూడా వారు సొంతగడ్డపై పనిచేయడాన్ని విధ్యుక్తధర్మంగా భావిస్తున్నారు. ఈ కారణాల వల్ల విదేశాల్లో వైద్యసేవలకు ఎలాంటి కొరత తలెత్తడం లేదు. మనదేశంలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారికి 'ఇన్ సర్వీస్ పీజీ కోర్సు'ల్లో ప్రవేశాలు కల్పిస్తున్నా, ఈ విధానం ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదు. వైద్య కళాశాలల నిర్వహణకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ఒక్కో విద్యార్థిపై సగటున రూ. 20 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివి, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తామంటూ పూచీకత్తు ఇచ్చినవారూ దాన్ని పాటించడం లేదు. ఎంబీబీఎస్ కోర్సును ప్రజల సంపూర్ణ ఆరోగ్య అవసరాల మేరకు వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ నేపథ్యంలోనే గ్రామీణ ప్రాంతాల్లో వైద్యనిపుణుల కొరతను అధిగమించడానికి 'గ్రామీణ ఆరోగ్య సంరక్షణ' పేరుతో మూడున్నర సంవత్సరాల డిగ్రీ కోర్సు (బీఆర్‌హెచ్‌సీ) చేపట్టాలని సర్కారు 2011-12లో నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 50 కళాశాలలను స్థాపించి ఈ కోర్సులను ప్రారంభించాలని భావించినా, అది కార్యాచరణకు నోచుకోలేదు.

**రోగులు-వైద్యుల నిష్పత్తి**

| దేశం | నిష్పత్తి |
|---|---|
| క్యూబా | 170కి ఒకరు |
| జర్మనీ | 290 కి ఒకరు |
| అమెరికా | 300కు ఒకరు |
| జపాన్ | 500కు ఒకరు |
| భారత్ | 1700లకు ఒకరు |

వైద్యరంగానికి మేలు కలిగించే ఎన్నో ప్రతిపాదనలు నిపుణులు చేస్తున్నారు. వైద్యవిద్యా విధానంలో కొన్ని సూచనలకు భాగం కల్పించారు. కానీ, అవి అమలులోకి రాలేదు. తాజాగా ఎంబీబీఎస్ శిక్షణ కాలాన్ని అయిదున్నరేళ్ల నుంచి నాలుగున్నరేళ్లకు కుదించడానికి ఎంసీఐ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఉన్న అయిదున్నరేళ్ల కోర్సు వ్యవధిని కుదించకుండా దాన్ని సద్వినియోగం చేసే విధంగా ప్రణాళికలు అవసరం. వ్యవధి కుదింపు వైద్యుల ప్రతిభకు మెరుగుపెట్టే చర్య కాబోదు. పాఠాలను కుదించడం మాటేమోగానీ, రోగుల సేవలకు మరింత విఘాతం ఏర్పడుతుంది. వైద్యవిద్యను బలోపేతం చేసే దిశగా సమూల మార్పుల ఆవశ్యకత ఉంది. చైనాలో అయిదున్నరేళ్ల ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసినవారి ప్రమాణాల పరిశీలనకు గుర్తింపు ధ్రువీకరణ పరీక్ష (లైసెన్షియేట్ ఎగ్జామినేషన్) నిర్వహిస్తున్నారు. చైనాలో వైద్యవిద్యా నాణ్యత పెంపుదలకు దోహదపడుతున్న విధానమిది. మనదేశంలో ఇలాంటి పరీక్షలు లేవు. ఎంబీబీఎస్ అనంతరం వారి పనితీరును పరిశీలించడమే లేదు. వైద్యవిద్యలో సంస్కరణలను చేపట్టే సమయంలో కేంద్రం విధిగా నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకోవాలి. విదేశాల్లో అమలులో ఉన్న విధానాలను పరిశీలించి, ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుని వాటిని అనుసరించాలి. ◆

*– ఆకారపు మల్లేశం,(ఈనాడు సౌజన్యంతో...)*

# ఆ ముగ్గురూ.... సమైక్య 'వ్యాపారులు'

తెలంగాణ ఏర్పాటు తొలినుంచీ ఒక అత్యంత సున్నితమైన వ్యవహారంగా నడుస్తూవచ్చింది. రెండు ప్రాంతాల ప్రజల మధ్యా భావోద్వేగాలు తీవ్రస్థాయికి చేరిపోయాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లుపై చర్చ సమయంలో సభలో సీమాంధ్ర నాయకులు వ్యవహరించిన శైలి ఈ అగ్నికి మరింత ఆజ్యం పోసింది. తమ సొంత ప్రయోజనాల కోసం ఉపయోగపడని ఎలాంటి పరిష్కారాలనూ తాము ఆమోదించబోమని ఆ నాయకులు భీష్మించుకు కూర్చున్నారు. లగడపాటి రాజగోపాల్, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, సీఎం రమేష్ మొదలైన నాయకులందరూ తమ వ్యాపార ప్రయోజనాలమీదే దృష్టిపెట్టి, తెలుగు ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టారు.

పదవులు వీరి వ్యాపారానికి ఇన్సూరెన్స్ పాలసీలు



వీరంతా తమ తమ వ్యాపార ప్రయోజనాలను రాజకీయాలతో ముడిపెట్టడం వల్ల అవశేష ఆంధ్రప్రదేశ్‌కు మంచి కంటే కీడే ఎక్కువగా జరిగింది. అనేకమంది రాజకీయ విమర్శకులు ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తున్నారు. సీఎం రమేష్ 'రిత్విక్ ప్రాజెక్ట్స్' అనే కంపెనీకి ప్రమోటర్. ఇది విద్యుత్, నిర్మాణం, సివిల్ రంగాల్లో పనిచేస్తోంది. వేణుగోపాల్‌రెడ్డి 'రామ్‌కీ గ్రూప్' నిర్ణేతల్లో ఒకరు. ఈ కంపెనీ కూడా రిత్విక్ తరహా వ్యాపారాలే చేస్తోంది. ప్రజాజీవితంలోనే ఎక్కువగా కనిపిస్తున్నా, లగడపాటి రాజగోపాల్ కూడా ఇదే తరహా వ్యాపారాలు నిర్వహిస్తున్న 'లాంకో గ్రూప్' యజమాని. ఈ కంపెనీలన్నీ ఈ శతాబ్దపు తొలిరోజుల్లో .. అంటే 2000 సంవత్సరం తర్వాతే పుట్టినవి. ఇవి దేశవ్యాప్తంగా భారీ ప్రాజెక్టులను చేజిక్కించుకోవడం ద్వారా దేశంలోని ప్రధాన ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పుట్టించుకోగలిగాయి; అతి తక్కువ సమయంలోనే భారీ స్థాయి కంపెనీలుగా నిలబడగలిగాయి. కానీ, ఈ గొప్పల్ని మరో కోణం నుంచి చూస్తే – ఈ అభివృద్ధిలోని డొల్లతనం బయటపడుతుంది. గత కొన్నేళ్ళుగా ఈ కంపెనీల్లో బయటపడుతున్న లొసుగులు దేశ ఆర్థిక వ్యవస్థపై పెను వ్యతిరేక ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇదే పరిస్థితి మరింత కాలం కొనసాగితే బ్యాంకింగ్ రంగమే పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితీ కనిపిస్తోంది.

రిత్విక్, రామ్‌కీ గ్రూపులు 2013లో భారీ రుణబకాయిదార్లుగా నమోదయ్యాయి. వస్తున్న ఆదాయం, అప్పులు, వడ్డీల ఆధారంగా రిత్విక్‌కి లభించిన ఆర్థిక రేటింగ్ మరీ అర్భకంగా వుంది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలను కనీస సమాచారం ఇచ్చే పరిస్థితిలో కూడా ఈ కంపెనీ లేకపోవడంతో కొన్నేళ్ళుగా ఇది సస్పెన్షన్‌లోనే వుంది. డబ్బామూత కంపెనీగా నమోదైనా దీని ప్రమోటర్లపై మాత్రం ఇది చీమకుట్టినంత ప్రభావాన్నయినా చూపించ లేకపోయింది.

ఇక సీఎం రమేష్. జూబిలీహిల్స్‌లో ఇప్పుడాయన 40 వేల అడుగుల విస్తీర్ణంలో ఒక గృహం నిర్మిస్తున్నారు. దీని విశిష్టతలను ఒక అంతర్జాతీయ పత్రిక 'హఫింగ్టన్ పోస్ట్' కూడా ప్రస్తావించిందంటే ఇదెంత భారీ స్థాయి నిర్మాణమో అర్థం చేసుకోవచ్చు.

“అత్యంత సంపన్నవర్గాలు నివసించే హైదరాబాద్ జూబిలీహిల్స్‌లో నిర్మిస్తున్న ఈ ఇల్లు ఒక ప్రయివేటు రిసార్టును తలపిస్తుంది. 25 అడుగుల ఎత్తున నిర్మించిన సీలింగ్ కిటికీలు కోర్టుయార్డును తలపిస్తాయి. అంతులేని ఐశ్వర్యానికి చిహ్నంగా కనిపించేలా టేకుతో పూల్‌డెక్ నిర్మించారు. ఇక ఈ భవంతిలోని బాత్‌రూమ్‌లను గతంలో ఎన్నడూ మనం చూసివుండం; వినివుండం. అద్భుతమైన రెండు భారీ షాండ్లియర్లను సీలింగ్‌కి ఏర్పాటు చేశారు. ఫ్లోరింగ్‌కి బ్రహ్మాండమైన మార్బుల్‌ను వాడారు. ఇక ఈ ఇంట్లో అన్నిటికంటా అద్భుతమైంది ఏదని అడిగితే – ఆ ఇంట్లోని థియేటర్ అని చెప్పాలి. అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలున్న కుర్చీలను ఈ థియేటర్‌లో ఏర్పాటు చేశారు”.

ఇక రామ్‌కీ. ఈ కంపెనీ ఆర్థిక పరిస్థితులను గుర్తించి, కొన్ని మినహాయింపులు ఇచ్చి, ఆర్థిక సంస్థలు సవరించిన (రీస్ట్రక్చర్ చేసిన) మొత్తమే 2500 కోట్ల రూపాయలు. అప్పులు, వడ్డీలు, పన్నులతో సంబంధం లేకుండా దాని ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే – అసలు సంగతి దేవుడెరుగు, కనీసం వడ్డీలు కట్టే పరిస్థితిలో కూడా లేదని తేటతెల్లమైపోయింది. ఏదో అద్భుతం జరిగితేనే తప్ప ఈ దుస్థితినుంచి బయటపడే మార్గమే లేదు. ఇంకెన్నిసార్లు సవరించినా కూడా ఈమేరకు వాటాదార్లకు, పన్ను చెల్లింపుదార్లకు భారీ ఇబ్బంది తప్పని దుస్థితి వుంది.

ఇక లాంకో గ్రూపు. దీనిది కూడా అచ్చు ఇదే పరిస్థితి. దీని మొత్తం అప్పు 35 వేల కోట్లు కాగా, 2014 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన 7500 కోట్లరూపాయలను ఆర్థిక సంస్థలు రీస్ట్రక్చర్ చేశాయి. గత కొన్ని త్రైమాసికాల ఐసీ వివరాలను గమనిస్తే, ప్రస్తుతం దీని ఆర్థిక స్థితి ... అప్పులకు వడ్డీలు చెల్లించడానికి మాత్రమే సరిపోతోంది. ఇక అసలు గురించి మాట్లాడడానికే వీల్లేదు. పార్లమెంటులో పెప్పర్ స్ప్రే ఉదంతం తర్వాత – సుచేతా దలాల్ అనే ఇన్వెస్ట్‌మెంట్ జర్నలిస్టు లాంకో గ్రూపు ఆర్థిక వ్యవహారాలపై పరిశోధించి, దీని రీస్ట్రక్చరింగ్ వ్యవహారాలన్నీ అవినీతిమయమని నిర్ధారించారు. గతంలో హర్షద్ మెహతా ఉదంతాన్ని కూడా ఆమే వెలుగులోకి తీసుకువచ్చారు. లాంకో ఎంత పెద్దఎత్తున ఈ రీస్ట్రక్చరింగ్ మోసానికి పాల్పడిందో వివరిస్తూ, లాంకోకు వున్న ఆస్తుల కంటే రీస్ట్రక్చర్ చేసిన మొత్తాలే ఎక్కువ అని తెలిపారామె. ఈ విషయాన్ని తన 'మనీలైఫ్ ఫౌండేషన్' ద్వారా ఆమె రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ రఘురామ్ రాజన్‌కు లేఖ రూపంలో తెలియజేశారు. సర్ఫేసీ చట్టం ప్రకారం రుణాల ఎగవేతదార్ల తాకట్టు ఆస్తులను వేలం వేయడం ద్వారా అప్పులు వసూలు చేసుకోవాలని ఆమె సూచించారు.

అధికారుల నుంచి తప్పించుకోవడానికి పారిశ్రామికవేత్తలకు రాజకీయాలు గొప్ప బీమా పాలసీల్లాగా మారాయి. అండ, అర్థ బలాలతో రాజకీయవేత్తలుగా మారిన పై తరహా పారిశ్రామికవేత్తలను ఎదుర్కోవడానికి ఏ అధికారికీ దమ్ము లేదు. అయితే, కేంద్రప్రభుత్వం రాష్ట్రవిభజన విషయంలో అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ, పార్లమెంటులో ఆఖరి దాకా సీమాంధ్ర ప్రయోజనాల కోసం నిలబడి, కొన్ని ప్రయోజనాలనైనా బీజేపీ నేత వెంకయ్య నాయుడు సాధించగలిగారు.

– కళ్యాణ్ భండారీ

(హన్స్ ఇండియా సౌజన్యంతో...)

# యుద్ధం ముగిసింది.. తర్వాత?

యుద్ధం ముగిసింది.. సూర్యుడుదయించాడు
ఖడ్గప్రహారాలకు అంగాంగాలూ, హృదయ శకలాలూ రాలిపడి
అంతా రక్తార్ణవమైపోయింది
ఎవరు ఎవరిని జయించారు, ఎవరు ఎవరితో ఓడిపోయారన్నది
ఒక భగ్నప్రశ్న
రక్తాలోడ్తున్న గాయాలు మిగలడమే సత్యం..
అంతా బీభత్స రంగస్థలం
బిచ్చగాళ్ళపై చిల్లరనాణేలెగరేసి కొట్టుకుంటున్న వాళ్ళనుచూస్తూ
పైవాచికానందాన్ని పొందేవాళ్ళు.. ఓడి వెళ్ళిపోయారు
ఇప్పుడు ఎవరినైనా ఎవరు ఎలా విడదీయగలరో ఆలోచించాలి
'విడిపోవడం'ను పునర్నిర్వచించగలమా
గొర్రెలు గుంపులో ఉండడం మరిచి
కాపరి కసాయితనం గురించి స్పృహించాలి
ఎలాగూ యుద్ధం ముగిసింది.. ఇక రక్తాన్ని కడుక్కోవాలి

తెలంగాణ వస్తే నాకు రిక్షా తొక్కడం తప్పుతుందా
ఆంధ్రా వేరైతే నేను రోడ్లూడ్చనవసరం లేదా
రాత్రవగానే చీప్ లిక్కర్ తాగేవాడు ఏ ప్రాంతంవాడో తెలుసా
రాత్రిని పగలుచేసి.. పగలును తెల్లవారని రాత్రిని చేస్తున్నవాళ్ళు
ఎక్కడున్నారు.. మనం బిస్కెట్లు తింటున్న కుక్కలమా
ఇప్పుడు జనం 'తెలుసుకుంటున్నారు'.. స్పృహిస్తున్నారు.

ఉద్యమాలు మేలే చేశాయి-గాయాలైనా, మరకలు మిగిలినా
మనుషులు 'పునర్నిర్మాణం' గురించి యోచిస్తున్నారు
పడితే గదా.. మనిషి మళ్ళీ లేచినిలబడేది
గాయపడ్డవాళ్ళందరిదీ ఒకటే జాతి-ఆంధ్రా ఐనా, తెలంగాణా ఐనా
గాయపర్చినవాణ్ణి గుర్తుపట్టాలి

- రామా చంద్రమౌళి




# సామాజిక చైతన్యం వైపు మళ్లించాలంతే

ఇప్పుడూ అంతే
రెండు యాసలూ.. ఒకే భాష
రెండు దేహాలూ.. ఒకే ఆత్మ
కరచాలనం చేసుకోలేనంత దూరంగా
భూమి జరిగిపోలేదు
కౌగిలించుకోలేనంత అనర్థం
కసి పెంచుకోవలసినంత అగాధం
ఏమి ఏర్పడి పోలేదు
విభజన వెంట్రుక మందంలో ఉన్న
సన్నని రేఖ మాత్రమే
అది ఒకటిగా నున్న రెండు హృదయాలను
ఖండించుకుంటూ పోదు
జరిగిందేదో జరిగింది
ఇక జరగవలసింది శపించుకోవడం కాదు
ఒకరినొకరు దీవించుకోవడం
ఆకలినీ దాహాన్నీ అభివృద్ధిని సంక్షేమాన్ని
సమంగా పంచుకోవడం
ఇక గిల్లి కజ్జాలు వద్దు
ఒళ్లొంచి ఎవడి అభివృద్ధికి వాడు కృషి చేద్దాం
ఇప్పుడు గుండెలు బాదుకోవలసిందీ లేదు
పండుగ చేసుకోవలసిందీ లేదు
ఇరు ప్రాంతాల్లో దొంగలు పడకుండా
ఇద్దరు చూసుకోవాలంతే
ఉవ్వెత్తున లేచిన ఉద్యమ స్ఫూర్తిని
సామాజిక చైతన్యం వైపు మళ్లించాలంతే..

**- నేతల ప్రతాప్‌కుమార్**
తణుకు, సెల్ : 95504 36286

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సమన్వయ కమిటీల ఏర్పాటు

- **ఆంధ్రప్రదేశ్‌కు డివివియస్ వర్మ**
- **తెలంగాణకు బండారు రామ్మోహన్‌రావు**

కేంద్ర ప్రభుత్వం, ప్రధాన సాంప్రదాయ రాజకీయ పార్టీల వల్ల రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ బృందం రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ ప్రభుత్వ, ప్రధాన ప్రతిపక్ష నేతలందరినీ, రాష్ట్రపతినీ పలుమార్లు కలిసి చేసిన ప్రయత్నాల వల్ల ఇటు తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరటంతోపాటు, అటు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల, ముఖ్యంగా యువత భయాందోళనలు తొలగించేందుకు కొంత ప్రాతిపదిక ఏర్పడింది. అడ్డగోలుగా రాష్ట్రాన్ని నరికేద్దామనుకున్న కేంద్రం లోక్‌సత్తా ప్రతిపాదనలను చాలామేర ఆమోదించాల్సి వచ్చింది. చివరకు లోక్‌సత్తా పరిష్కారంగా సూచించిన సవరణల్నే తీసుకున్న బీజేపీ రాజ్యసభలో వాటి కోసం పట్టుబట్టింది.



డివివియస్ వర్మ



బండారు రామ్మోహన్‌రావు

"లోక్‌సత్తా పార్టీ తన కొత్త రాజకీయం ఆధారంగా ప్రజల ఆకాంక్షలను సాకారం చేసే దిశగా రెండు రాష్ట్రాలలోనూ కీలకపాత్ర పోషించేందుకు వెంటనే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించింది. తొలి అడుగుగా రెండు రాష్ట్రాలకు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని భావించింది. ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 24న ఈ నిర్ణయాన్ని జాతీయ కార్యవర్గం ఆమోదించింది"

### రెండు రాష్ట్రాల సమన్వయ కమిటీల వివరాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీకి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్న డి.వి.వి.ఎస్.వర్మ కన్వీనర్‌గా, ప్రాంతీయ ఉపాధ్యక్షులైన వై.డి. రామారావు, ఓంకార్, రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ కో కన్వీనర్లుగా ఉంటారు.

తెలంగాణ రాష్ట్ర సమన్వయ కమిటీకి లోక్‌సత్తా పార్టీ తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు బండారు రామ్మోహనరావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పార్టీ హైదరాబాద్ నగర బాధ్యతలు చూస్తున్న రాష్ట్ర కార్యదర్శి నందిపేట రవీందర్ కో కన్వీనర్‌గా ఉంటారు.

లోక్‌సత్తా పార్టీ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటారి శ్రీనివాసరావు, పి. రవిమారుత్ రెండు రాష్ట్రాల కో ఆర్డినేషన్ కమిటీలలో అధికారయుతంగా సభ్యులుగా ఉంటారు. ఈ ఏర్పాటు రెండు రాష్ట్రాలలో పార్టీ ఎన్నికలు జరిగి అధికారిక కమిటీలు ఏర్పడే వరకు కొనసాగుతుంది.

వర్కింగ్ కమిటీ సభ్యులు వారి ఆప్షన్ ప్రకారం ఆయా కమిటీలలో ఉంటారు. ఈ కమిటీలలో సంస్థాగత ఎన్నికలు జరిగిన జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జరగని చోట జిల్లా సభ్యత్వ కమిటీ కన్వీనర్లు సభ్యులుగా ఉంటారు.

ఈ కమిటీలు సమావేశమై 7 గురికి మించకుండా అవసరమైన అర్హులతోపాటు యువత, మహిళలు, బలహీన వర్గాల వారిని కో ఆప్ట్ చేసుకుంటారు. తెలంగాణ రాష్ట్ర కమిటీలో జి. రాజారెడ్డి, డా॥ పి. ఆర్ రావు, వి. విజయేందర్ రెడ్డిని కో ఆప్ట్ చేస్తున్నట్టు రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో మిగిలిన నలుగురిని, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 7 గురిని ఆయా రాష్ట్ర సమన్వయ కమిటీలు చర్చించుకొని నియమించుకోవాలి. ◆

# 'తొలి ప్రేమెంత మధురమో తొలి ఓటు అంత ముఖ్యం'

**హైదరాబాద్**

'తొలి ప్రేమెంత మధురమో తొలి ఓటు అంత ముఖ్యం' అని లోక్‌సత్తా పార్టీ అధినేత, కూకట్‌పల్లి ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని విజేత డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'ఫస్ట్ లవ్ ఫస్ట్ ఓట్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తొలిప్రేమ ఎంత మధురమో తొలి ఓటు అంత మధురమని, మనం ప్రేమించే వారిని ఏ విధంగా ఎంచుకుంటామో మనల్ని పాలించే నాయకులను అలాగే ఎన్నుకోవాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి లోక్‌సత్తాతో కలిసి పనిచేసి అవినీతి రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి తోడ్పడాలన్నారు. అందుకు విజేత కళాశాలను వేదికగా చేసుకుని ప్రేమికుల రోజున యువతను చైతన్యవంతం చేయడానికి శ్రీకారం చుట్టామని, లోక్‌సత్తా పార్టీలో సభ్యత్వం తీసుకోవడానికి విద్యార్థులు 09220092200 నంబరుకు (ఎల్ఎస్‌పీ స్పేస్ పేరు, స్పేస్ ఈ మెయిల్ స్పేస్ నగరం) ఎస్ఎంఎస్ పంపాలని, వివరాలకు తమ వెబ్‌సైట్ www.firstlovefirstvote.inలో చూడవచ్చునని, ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగించే వారు 'firstlovefirstvote' ఆప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని జేపీ సూచించారు.

# హామీలతో ప్రజలను మోసగిస్తున్నారు




కాంగ్రెస్, టీడీపీ, వైసీపీలు ఓట్ల కోసం ఆచరణకు సాధ్యం కాని హామీలను గుప్పిస్తూ ప్రజలను మోసగిస్తున్నాయని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు కె.పూలనాయుడు అన్నారు. స్థానిక ప్రైవేటు డిగ్రీ కళాశాల ఆవరణలో లోక్‌సత్తా నియోజకవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాయిలాలు ప్రకటించే రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పంచాది రాంబాబు మాట్లాడుతూ.. లోక్‌సత్తాతోనే యువతకు ఎదుగుదల ఉందన్నారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్షుడిగా టి.మాధవరావు, ఉపాధ్యక్షులుగా సిందిరి మధుసూదనరావు, సవర భాస్కరరావు, బొండా మంజులతను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా డా॥రోణంకి ఆనందరావు, సహా కార్యదర్శులుగా కోరాడ కృష్ణారావు, జి.హరిబాబు, ఎ.పాపారావు, కోశాధికారిగా మజ్జి వాసుదేవరావును ఎన్నుకున్నారు.

# రైతు బజారు ఏర్పాటు చేయాలి

**పలాస**

పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో రైతుబజారు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ పలాస కన్వీనర్ తమ్మినేని మాధవరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ బస్టాండ్ వద్దనున్న సంతలో ఆయన పర్యటించి ప్రజలతో, చిరు వర్తకులతో మాట్లాడారు. బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్న సంత వ్లల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్తనన్నారు. రైతుబజారు కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబజారు కోసం లోక్‌సత్తా పార్టీ తరపున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# లోక్‌సత్తాయే ప్రత్యామ్నాయం




గుంటూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ జిల్లా మరియు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ డివివియస్. వర్మ అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాంప్రదాయ రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తిగా లోక్‌సత్తా పార్టీ మాత్రమే ఎదుగుతుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు విభజన విషయంలో ప్రజలను వంచనకు గురిచేసి కేవలం ఓట్లు కోసం రాష్ట్ర భవిష్యత్తును, ప్రజలను పణంగా పెట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు సాంప్రదాయ రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే 9,000 కోట్ల రూపాయలు రెవిన్యూలోటు ఉంటే తెలుగుదేశం హామీలరూపంలో రైతులకు రుణమాఫి, డ్వాక్రా రుణాల మాఫీ అంటూ ఏకంగా 90,000 కోట్ల రూపాయలను ఉచితంగా ఇస్తామంటూ హామీలను గుప్పిస్తూ మళ్ళీ ప్రజలను మోసం చేస్తుంది. అవినీతి సొమ్ముతో అందలాలు ఎక్కటానికి మరో వారసత్వ పార్టీ వై.యస్.ఆర్.సిపి సిద్ధపడుతుంది. ఈ పార్టీలకు బుద్ది చెప్పి లోక్‌సత్తా పార్టీకి ప్రజలు పట్టంకట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలియజేశారు. రాష్ట్రంలో కోటిమంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారని, వారంతా తమ ఓటు హక్కును కాంగ్రెస్, టిడిపి, వైకాపాలకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతున్న లోక్‌సత్తాపార్టీకే తొలిఓటుగా వెయ్యటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రానున్న కాలంలో ఈ సాంప్రదాయ రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా లోక్‌సత్తా పార్టీ మాత్రమే ఉ ంటుందని దీనికి పెద్దయెత్తున యువత మద్దతు ఉందని అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జె.ఐరామమూర్తి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# రూ.126 కోట్ల పెన్నానది బ్రిడ్జి నిధులు నీళ్ళపాలు అయ్యే ప్రమాదం - లోక్‌సత్తా

**నెల్లూరు**

నెల్లూరు నగరానికి ఇతర ప్రాంతాలకు అనుకూలంగా నీటి నిల్వను 0.4 టిఎంసిలుగా నిర్ణయించి త్రాగునీరు, సాగునీరుకి కొరత లేకుండా చేయాలని 2008/2009లో ప్రారంభించిన పెన్నా రివర్ బ్రిడ్జి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. నిధులు మాత్రం 126 కోట్లలో 85 కోట్లు ఇప్పటికే గుత్తేదారుకి చెల్లించటం జరిగింది. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు మక్కెన అంకయ్యచౌదరి అధ్యక్షతన ఒక ప్రతినిధి బృందం ప్రాజెక్టు దగ్గరికి వెళ్ళగా కనీసం అంచనా విలువకి సంబంధించిన బోర్డుకాని, ఆ పనిని ఎవరు పర్యవేక్షిస్తున్నారో, గుత్తేదారు ఎవరో తెలియకపోవడం చాలా దారుణం అని అన్నారు. తెలుగుగంగ అధికారులు ప్రాజెక్టును పర్యవేక్షించుచున్నారని తెలిసింది. వారు ఎన్ని నోటిసులు ఇచ్చినా స్పందన లేదు. ఆ నిధులు నీటిపాలు కాకుండా కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ బాధ్యులు పివిల్ రవికుమార్, వై.వి.కిషోర్, పి.పుష్పలత, యల్.క్రిష్ణవేణి, బి.రవి, తిరపతమ్మ, యం.యస్.మణియాదవ్, సి.పి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తెలుసుకునేందుకు ఎజెండా కార్యక్రమం




చేతివృత్తుల కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు భానుప్రసాద్ తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో జనం నుంచి ఎజెండాలో భాగంగా పొట్టిశ్రీరాములు కాంప్లెక్స్‌లో కార్పెంటర్లు, వివిధ వృత్తుల కార్మికులను పార్టీ నాయకులు కలిసి సమస్యలు తెలుసుకున్నారు. పలువురు తమకు ప్రమాదాలు జరిగినప్పుడు వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయని వాపోయారు. బీమా, కార్మిక శాఖ గుర్తింపుకార్డులు లేకపోవటంతో సంక్షేమ పథకాలకు నోచుకోవటం లేదని వాపోయారు. భానుప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని వాటిని ఎజెండాలో చేర్చేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు మురికిపూడి ప్రసాద్, షేక్ ఖాదర్, వెంకట్రావు, షరీఫ్ పాల్గొన్నారు.

# నియోజకవర్గ మహిళల భద్రత కోసం ఒక మహిళా పోలీస్ స్టేషన్




లోక్‌సత్తా పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి హైమాప్రవీణ్ ఆధ్వర్యంలో బన్సిలాల్ పేట్ డివిజన్ పరిధిలో పొట్టి శ్రీరాములు నగర్‌లో 31వ మహిళా సాధికారత సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హైమా మాట్లాడుతూ నియోజకవర్గ మహిళల భద్రత కోసం ఒక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఇటీవలే 50 కి.మీ. పాదయాత్ర చేశామని, ఈసారి లోక్‌సత్తాకి మద్దతు ఇస్తే మొట్టమొదటిగా ప్రథమ కర్తవ్యంగా మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలు లోక్‌సత్తా దృష్టికి తీసుకువచ్చారు. ప్రక్కనే స్మశానం ఉన్నందున శవాల దహనం వల్ల వచ్చే వాసన వల్ల తీవ్ర రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. దీనికోం ఎత్తైన గోడ నిర్మాణానికి ప్రయత్నం చేస్తామని హైమా అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు రాజీవ్, లావణ్య, విమల, రాజు, జానకిరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జేపీపై దాడి... రాష్ట్రంలో వెలువెత్తిన నిరసనలు

## విశాఖలో...

రాష్ట్ర విభజన అంశంపై అందరికి ఆమోదయోగ్యమైన సామరస్య పూర్వక పరిష్కారం కొరకు సూచనలు ప్రతిపాదించిన లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై కొందరు తెలంగాణా న్యాయవాదులు ఢిల్లీలోని ఎ.పి. భవన్ వద్ద దాడి చెయ్యడాన్ని వ్యతిరేకిస్తున్నామని, దీన్ని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షులు నాయుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. జేపీపై జరిగిన దాడిని నిరసనగా జివియంసి గాంధీ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు, పులపా శ్రీనివాస్, సాంబశివరావు, పి.శ్రీనివాస్, నిశ్చల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కోవెలకుంట్లలో...

ఢిల్లీలోని ఎ.పి. భవన్ వద్ద లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై కొందరు తెలంగాణా న్యాయవాదులు దాడి చెయ్యడం హేయమైన చర్య అని కోవెలకుంట్లకు చెందిన పలువురు అఖిలపక్షం నాయకులు పేర్కొన్నారు. స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జి శ్రీనివాసనాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు ప్రాంతాల్లోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని కోరుతున్న జేపీపై దాడి చేయడం నీచమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లింగన్న, సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పాండు, హరి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో...

అవినీతిరహిత రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో డా॥ జయప్రకాష్ నారాయణ్ చేస్తున్న ప్రయత్నాన్ని తట్టుకోలేకే ఈ దాడులకు పాల్పడుతున్నారంటూ జిల్లా పార్టీ అధ్యక్షుడు సిద్ధయ్య ధ్వజమెత్తారు. ఢిల్లీలోని ఎ.పి. భవన్ వద్ద లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై కొందరు తెలంగాణా న్యాయవాదులు దాడి చెయ్యడాన్ని నిరసిస్తూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి బాలు, సహాయ కార్యదర్శి కిరణ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో...

ఢిల్లీలోని ఎ.పి. భవన్ వద్ద లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై కొందరు తెలంగాణా న్యాయవాదులు దాడి చెయ్యడాన్ని నిరసిస్తూ, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని నంద్యాల లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా॥జె.శౌరిరెడ్డి, జిల్లా ట్రెజరర్ యం.వి.సత్య నారాయణ, నగర నాయకులు ఉమకాంతయ్య, రవిగౌడ్, తిరుపతయ్య, ప్రభాకర్, జి.వి.రమణ, మహబూబ్ వలి, ఆర్.కె.చైతన్య, యువసత్తా నాయకులు యస్.పి.దాస్, ఇక్బాల్, ఖలీల్, హర్షద్, రెడ్డి నౌషాద్, జిలానీ పాల్గొన్నారు.

## భీమిలీలో...

ఢిల్లీలోని ఎ.పి. భవన్ వద్ద లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై కొందరు తెలంగాణా న్యాయవాదులు దాడి చెయ్యడం అనాగరిక చర్య అని ఆ పార్టీ భీమిలీ నియోజకవర్గం అధ్యక్షుడు సీతారామరాజు అన్నారు. తెలంగాణ న్యాయవాదుల చర్యకు నిరసనగా స్థానిక కార్‌షెడ్ కూడలి వద్ద జాతీయరహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలీ కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్, ఉత్తమ్, యువసత్తా నాయకులు మిధున్, మధుబాబు, సోమేష్, జశ్వంత్, మహేష్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



డా॥ జేపీ ఆధ్వర్యంలో లోక్‌సత్తాలో చేరిన యువత



శ్యామలకుంటలో మహిళా సాధికారత సదస్సు




డా॥ జేపీ పై దాడికి నిరసనగా చందానగర్‌లో ధర్నా



నెల్లూరులో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న లోక్‌సత్తా నాయకుడు



పలాసలో జనం నుంచి ఎజెండా కార్యక్రమం



విజయనగరం జిల్లా, కురుపాంలో లోక్‌సత్తా ప్రచారం



అనకాపల్లిలో జనం నుంచి ఎజెండా కార్యక్రమం



కర్నూలులో లోక్‌సత్తా సమావేశం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on 1st March, 2014



చందానగర్‌లో అడ్డ కూలీలతో డా॥ జేపీ







To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**

8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad